అధినాయకత్వం వ్యూహం... ఆశావహులకు టెన్షన్

కోళ్ల లలితకుమారి

కిమిడి నాగార్జున

విశాలాంధ్ర-విజయనగరం : గెలుపు గుర్రాలకే టికెట్ ... ఈ మాట ఆ రెండు నియోజకవర్గాల నాయకులకు టెన్షన్ పుట్టిస్తోంది. తమ పేరు ఎన్నిల రేసులో ఉంటుందా లేదా అనే ఎదుచూపులతో చెమటలు పట్టిస్తోంది. విజయనగరం జిల్లా ఎస్‌కోట, చీపురుపల్లి నాయకుల ప్రస్తుత పరిస్థితి ఇదేనంటే అతి శయోక్తికాదు. ఎస్ కోట నియోజకవర్గం టిడిపి కంచుకోటగా ఆ పార్టీకి అండగానిలిచిన నియోజకవర్గం. 2004 మినహా పార్టీ ఆవిర్భావం నుంచి 2014 వరకు టిడిపి అభ్యర్థులకే పట్టం కట్టిన చరిత్ర నియోజక వర్గానికి వుంది. ప్రస్తుతం టికెట్ ఆశిస్తున్న కోళ్ల లలితకుమారి 2009, 2014లో విజయం సాధించారు. 2019లో 11365 ఓట్ల తేడాతో వైసిపి అభ్యర్థి కడుబండి శ్రీనివాసరావు చేతిలో ఓటమి చెందారు. ఇప్పుడు ఆమెతో పాటు గొంపకృష్ణ కూడా టికెట్ ఆశిస్తుండడంతో వీరిద్దరిలో ఎవరికి టికెట్ దక్కుతుందోననే ఉత్కంఠ నెలకొంది. ఎవంరికి వారు పార్టీ కార్యకమాలను తమదైన శైలిలో నిర్వహిస్తున్నారు. నియోజ కవర్గమంతా తిరుగుతూ తామే అభ్యర్థి అనే ఆత్మ విశ్వాసంతో ముందుకు సాగుతున్నారు. అయితే టిడిపి అధిష్టానం తాజాగా జిల్లాలో ఇతర నియోజక వర్గాల అభ్యర్థుల విషయంలో తీసుకున్న నిర్ణయాన్ని కళ్లారా చూసిన ఎస్ కోట ఆశావహులకు తమ పరిస్థితి ఎలా ఉండబోతోందో అనే టెన్షన్ మొదలైంది. గజపతినగరంలో కెఎ నాయుడుని పక్కన పెట్టడం, నెల్లిమర్ల సీట్ జనసేనకు కేటాయిండం వంటి అధిష్టానం వైఖరితో తమదాకా వస్తే పరిస్థితి ఎలా ఉంటుందో అనే ఆందోళన టిడిపి అశావహుల్లో ఉంది. జిల్లాలో మరొక కీలక నియోజకవర్గమైన చీపురుపల్లి లో కూడా ఇటువంటి టెన్షన్ నెలకొంది. ఇక్కడ టీడీపీ పార్లమెంటరీ నియోజకవర్గ అధ్యక్షుడు కిమిడి నాగార్జున టికెట్ ఆశిస్తున్నారు. 2019లో నాగార్జున 26,498 ఓట్ల తేడాతో బొత్స సత్యనారాయణ చేతిలో ఓటమి చెందారు. తరువాత నియోజకవర్గంలో అందుబాటులో వుంటూ పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లా అధ్యక్షునిగా ప్రభుత్వ వైఖరిని ఎండగడుతూ మంత్రి బొత్సపై విమర్శనాస్త్రాలు సంధిస్తూ వచ్చారు. అయితే అనూహ్యంగా చీపురుపల్లి నుంచి గంటా శ్రీనివాసరావు ను బరిలోకి దింపే యోచనలో అధిష్టానం వుందనే టాక్ నాగార్జున వర్గానికి షాక్ కు గురిచేసింది. నియోజకవర్గంలో మరో ఆశావహునిగా వున్న కుచ్చర్లపాటి త్రిమూర్తుల రాజును సైతం నాగార్జున అభ్యర్థిత్వం కోసం అధిష్టానం ఒప్పిం చిందని, అందువల్ల తప్పనిసరిగా అధిష్టానం నాగార్జునకే టికెట్ కేటాయిస్తుందని ఆయన వర్గం నమ్ముతోంది. అయితే తాజాగా టికెట్ల కేటాయింపులో చీపురుపల్లి నియోజకవర్గం పేరు ప్రకటించకపోవడంతో సహజంగానే నాగార్జున అభిమానుల్లో ఆందోళన కలిగిస్తోంది. మరో వైసీపీ సిట్టింగ్ ఎమ్మెల్యే, మంత్రి బొత్స సత్యనారాయణ భీమిలి నుంచి పోటీకి దిగుతారనే ప్రచారం సాగడంతో, చీపురుపల్లిలో వైసీపీ అభ్యర్థి ఎవరనేది స్పష్టత వచ్చేవరకు టీడీపీ అధిష్టానం వేచి చూస్తోందనే మాటా లేకపోలేదు. అధికార, విపక్ష అధినాయకత్వ వ్యూహ ప్రతి వ్యూహాలెలా వున్నా, ఎన్నికలకు సన్నద్ధమై, నియోజకవర్గంలో విస్తృతంగా పార్టీ కార్యక్రమాలు నిర్వహిస్తూ వస్తున్న నాయకులను కాదని మరొక అభ్యర్థి ని తెరపైకి తేవడమంటే సాహసమేనని రాజకీయ విశ్లేషకులంటున్నారు. పార్టీ అధినేతలు గెలుపుగుర్రాలకే పోటీచేసే అవకాశం కల్పిస్తారనే మాట ప్రస్తుతానికి టికెట్ కోసం ఎదురుచూపులు చూస్తున్న ఆశావహులకు మాత్రం టెన్షన్ పుట్టిస్తోంది.

రాక్షస పాలనకు బుద్ధి చెప్పాలి

తెలుగుదేశం-జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి విజయలక్ష్మి

విశాలాంధ్ర-విజయనగరం అర్బన్ : వైకాపా రాక్షస పాలనకు ప్రజలు బుద్ధి చెప్పాలన్నారు. సోమవారం తెలుగుదేశం పార్టీ కార్యా లయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థి అదితి విజయలక్ష్మి గజపతిరాజు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, జనసేన అధినేత పవన్ కళ్యాణ్ కలిసి విజయనగరం నియోజకవర్గం తెలుగుదేశం జనసేన ఉమ్మడి అభ్యర్థిగా నన్ను ప్రకటించి నందుకు ధన్యవాదాలు తెలిపారు. రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం జనసేన కుటుంబ సభ్యులు కలిసికట్టుగా సమన్వయంతో పనిచేసి ఈ రాక్షస ప్రభుత్వాన్ని గద్దె దింపాలన్నారు. అధిష్టానం నా మీద నమ్మకంతో ఈ బాధ్యత అప్పగించినందుకు టిడిపి కార్యకర్తలు, జనసేన కార్యకర్తలు కలిసి నాపై నమ్మకాన్ని నిలబెట్టే విధంగా పనిచేసి నన్ను గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జ్ పాలవలస యశస్విని, తెలుగుదేశం నాయకులు ఐవీపీ రాజు, బొద్దల నరసింహారావు, కంది మురళి నాయుడు, తెలుగుదేశం, జనసేన నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ,ఉద్యోగుల ఆర్థిక బకాయిలు, తక్షణమే చెల్లించాలి : ఎస్టీయూ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్ల, సమస్యల పరిష్కారం లో ప్రభుత్వం ఇచ్చే ఉత్తుత్తి హామీలను నమ్మే స్థితిలో ఎవరూ లేరని రాష్ట్రోపాధ్యాయ సంఘం (ఎస్.టి.యు) విజయనగరం జిల్లా అధ్యక్షులు కె. జోగారావు స్పష్టం చేశారు.సోమవారం స్థానిక అమర్ భవన్ కార్యాలయంలో ,జిల్లా కార్యవర్గ సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ టి యు జిల్లా అధ్యక్షులు కె.జోగారావు మాట్లాడుతూ తమను మభ్యపెట్టే విధంగా వేతన సవరణ కమిటీని నియమించి,కనీసం మధ్యంతర భృతి ఇవ్వకపోవడం దారుణమని విమర్శించారు. ఉద్యమాలను పోలీసు బలంతో ఎన్నో రోజులు అణచివేయలేరని స్పష్టం చేశారు. ఎస్.టి.యు జిల్లా ప్రధాన కార్యదర్శి, చిప్పాడ.సూరిబాబు మాట్లాడుతూ, ఉపాధ్యాయులను ఉద్దేశ పూర్వకంగా ఇబ్బంది పెట్టే విధంగా కొందరు అధికారులు వ్యవహరిస్తున్నారని ఆవేదన వ్యక్తంచేశారు. ఏకోపాధ్యాయ పాఠశాలల ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న కష్టాలు వర్ణనాతీతమన్నారు.తీవ్రమైన ఇబ్బందులు ఉన్నవారిని ,ఎన్నికల విధుల నుండి మినహాయించాలని విజ్ఞప్తి చేశారు. 117 జి. ఓ ను తప్పనిసరిగా సవరించాలని, డి ఎస్సీ నోటిఫికేషన్ ను సమీక్షించి 50 వేల పోస్టులలో మెగా డిఎస్సీ ప్రకటించాలని డిమాండ్ చేసారు. కార్యక్రమంలో రాష్ట్ర కౌన్సిలర్ గోవిందరావు జిల్లా ఉపాధ్యక్షులు, ఎం ఏ స్వామి ,జిల్లా అదనపు ప్రధాన కార్యదర్శి, పి రాంబాబు రాంబాబు జిల్లా నాయకులు నాగేశ్వరరావు పాల్గొన్నారు.

రాజ్యసభ సభ్యునిగా ఎన్నికైన వై.వి.సుబ్బారెడ్డికి అవనాపు శుభాకాంక్షలు

విశాలాంధ్ర-విజయనగరం: రాజ్య సభ సభ్యునిగా ఎన్నికైన వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రీజనల్ కో-ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డిని సోమవారం శ్రీకాకుళం, పార్వతీపురం మన్యం, అల్లూరి సీతారామరాజు జిల్లాల వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ యూత్ వింగ్ జోనల్ ఇంచార్జ్ అవనాపు విక్రమ్, ఉమ్మడి విజయనగరం జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటీ (డిసిఎంఎస్) చైర్ పర్సన్ డాక్టర్ అవనాపు భావన దంపతులు మర్యాద పూర్వకంగా కలిశారు. రాజ్యసభ సభ్యులుగా నియమితులైన వై.వి.సుబ్బారెడ్డిని కలిసిన అవనాపు విక్రమ్ దంపతులు గజమాలతో సత్కరించి శుభాభినందనలు తెలిపారు. అవనాపు విక్రమ్ దంపతులతో పాటు వైకాపా నాయకులు సంపత్ రాజు, బోని రామారావు,అవనాపు విజయభాస్కర్, ఎర్నింటి నర్సింగరావు,మద్దిల అప్పలనాయుడు,సాధు కృష్ణ,మద్దిల దుర్గారావు, సముద్రపు వెంకట రమణ, సిరిశెట్టి పైడిరాజు, కొప్పల రాము,వంక అప్పలరాజు,సుంకరి విజయ్,సంపత్ ఖాదర్ సుబ్బారెడ్డి కి శుభాకాంక్షలు తెలిపారు.

డైట్ ప్రిన్సిపాల్‌గా పగడాలమ్మ బాధ్యతల స్వీకరణ

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వేణుగోపాల పురం ప్రభుత్వ ఉపాధ్యాయ శిక్షణా కేంద్రం ప్రిన్సిపాల్‌గా జి పగడాలమ్మ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇంతవరకూ ఎఫ్ఎసి ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహించిన నల్లా తిరుపతి నాయుడు రిలీవ్ అయ్యారు. ఇక్కడే వైస్ ప్రిన్సిపాల్ గా విధులు నిర్వహిస్తారు. పగడాలమ్మ రిగ్యూలర్ ప్రిన్సిపాల్ గా వ్యవహరించడంతో పార్వతీపురం మన్యం జిల్లా ఎఫ్ఎసి డిఇఓగా విధులు నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఆమెకి డైట్ అధ్యాపకులు దుశ్శాలువ కప్పి పుష్పగుచ్ఛం అందించి సత్కరించారు.

తహసీల్దార్ బదిలీ

విశాలాంధ్ర-వేపాడ : వేపాడ మండలం తహసిల్దార్ గా పనిచేస్తున్న కే ప్రసన్న కుమార్ ను తెర్లాం మండలానికి బదిలీ చేసినట్లు తెలిసింది. ఇక్కడకు గరివిడి మండల తహసిల్దార్ గా పనిచేస్తున్న బి.సత్యమును బదిలీ చేస్తూ జిల్లా కలెక్టర్ నాగలక్ష్మి ఉత్తర్వులు జారీ చేసినట్లు తెలిసింది.ఈ బదిలీలు శాసనసభ ఎన్నికలను పురస్కరించుకొని చేపట్టినట్లు రెవెన్యూ వర్గాలు వెల్లడించాయి.

మార్చి 3 నుండి మున్సిపల్‌లో జరిగే పల్స్‌పోలియోను జయప్రదం చేయండి

మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి

విశాలాంధ్ర-బొబ్బిలి: పల్స్‌పోలియో రహిత సమాజం కోసం పట్టణంలో మార్చి 3 నుండి 5 వరకు జరుగు పల్స్ పోలియో కార్యక్రమాన్ని సంబంధిత సిబ్బంది జయప్రదం చేయాలని మున్సిపల్ కమిషనర్ లాలం రామలక్ష్మి పిలుపునిచ్చారు. సోమవారంపురపాలక సంఘ కార్యాలయంలో కమిషనర్ ఎల్. రామలక్ష్మి అధ్యక్షతన సంఘ వీధి గొల్లపల్లి మరియు సాయి నగర్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్ల డాక్టర్లు, హెల్త్ అడ్వైజర్లు, అన్ని సచివాలయాల వార్డు హెల్త్ సెక్రటరీలు మరియు అంగన్వాడీ టీచర్లతో పల్స్ పోలియో కార్యక్రమం పై సమీక్ష సమావేశం నిర్వహించారు.బొబ్బిలి పురపాలక సంఘ పరిధిలో పల్స్ పోలియో కార్యక్రమం మార్చి మూడు నుండి ఐదు వరకు నిర్వహించబడుతుందని, సదరు కార్యక్రమంలో అప్పుడే పుట్టిన శిశువు నుండి 5 సంవత్సరంల వయసు గల వారందరికీ నిర్దేశించబడిన కేంద్రాలలో, బస్టాండు మరియు రైల్వే స్టేషన్లలో ఉదయం 7 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు పల్స్ పోలియో కార్యక్రమం నిర్వహించబడుతుందని తెలియజేశారు. సదరు కార్యక్రమంలో 0 నుండి 5 సంవత్సరములు గల ప్రతి ఒక్క శిశువు వినియోగించుకునేలా చేసి పోలియో రహిత సమాజాన్ని నిర్మించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సంఘ వీధి యుపిహెచ్ డాక్టర్ మూడడ్ల వెంకట శ్యామ్, గొల్లపల్లి యుపిహెచ్‌సి డాక్టర్ కిమిడి అమిత, సాయినగర్ యుపిహెచ్‌సి డాక్టర్ గొంగాడ సాయికుమార్ మరియు మునిసిపల్ మేనేజర్ బి.యం. శివప్రసాద్ పాల్గొన్నారు.

బాబోయ్.. భీమసింగి భూములా..!

గ్రామంలో అన్నీ వివాదాలే..కేసులతో తిరుగుతున్న కొనుగోలు దారులు

గ్రామ పెద్దల ఆదేశాలు ఇక్కడ భేఖాతర్

వివాదంలో చిక్కుకున్న ఓస్థలంల

విశాలాంధ్ర-జామి: మీరు భీమసింగి రెవెన్యూ పరిదిలో భూమిని కొంటున్నారా.. అయితే మీరు పోలీసులు, రెవెన్యూ, కోర్టుల చుట్టూ తిరగడానికి సిద్ధపడాల్సిందే.. ఎందుకంటే మీరు కొనుగోలు చేసే సమయంలో ఎటువంటి వివాదాలు లేని ఈస్థలాలు కొనుగోలు అనంతరం వివాదాలు తప్పకుండా వస్తాయి. దీంతో అయ్యో.. రామా అంటూ ఆవేదన చెందాల్సిందే.. మండలం లోని భీమసింగి పరిధిలోని భూములకు ఒక్కసారిగా మార్కెట్ ధర పెరిగిపోయింది. ఎకరా భూమి ఆరుకోట్లునుంచి 10 కోట్లు వరకు ధర పలుకుతోంది. దీంతో పాటు భూవివాదాలు కూడా ఎక్కువయ్యాయి. 5ఏళ్ళ క్రితం వివాహమైన ఆడపిల్ల పిల్లలు కూడా తమకు వాటాలో హక్కు ఉందని కోర్టును ఆశ్రయిస్తున్నారు. దీంతో ఏమి చేయాలో తెలియక కొనుగోలుదారులు ఆవేదన చెందుతున్నారు. ప్రధానంగా కొంతకాలంగా కొందరు వ్యక్తులు భూమిలలో ఉన్న లొసుగులను తెలుసుకుని కుటుంబ సంభందికుల మధ్య చిచ్చుపెడుతున్నారు. లక్షల్లో ఆస్తులు కావడంతో కుటుంబ సంభందాలను పక్కనబెట్టి వివాదాలకు ప్రాధాన్యత ఇస్తున్నారు. ప్రస్తుతం ఇటువంటి వివాదాలలో భీమసింగి రికార్డు స్థాయిలో పేరు సాధించింది. ఏళ్ళ క్రితం కొనుగోలు చేసిన స్థలాలలో వివాదాలు రావడంతో కొనుగోలు దారులు పోలీసులను ఆశ్రయిస్తున్నారు. ఇక గ్రామ పెద్దలు విషయానికి వస్తే, భూవివాదాలను కొందరు పెద్దలే ప్రోత్సహించడంతోపాటు పంచాయతీ కూడా వారే నిర్వహిస్తున్నారు. దీంతో పెద్దలంటే గౌరవం లేకపోగా, వారి మాటలను సైతం లెక్క చేయడం లేదు. దీంతో వివాదాలు గ్రామాన్ని దాటుతున్నాయి. ఈవివాదాలు తెలుసుకుంటున్న కొనుగోల్లుదారులు అమ్మో.. భీమసింగిలో భూములా వద్దుబాబూ అంటున్నారు.. ఈవివాదాలకు ఎప్పుడు ముగింపు పలుకుతారో వేచి చూడాలి మరి..

అక్రమ మట్టి తవ్వకాలపై కఠిన చర్యలు తీసుకోవాలి

బీజేపీ జిల్లా పార్లమెంటరీ కార్యవర్గ సభ్యులు మిత్తిరెడ్డి మధుసూదనరావు

విశాలాంధ్ర-రాజాం: రాజాం పురపాలక సంఘ పరిధి సారధి గ్రామంలో ప్రభుత్వ భూములలో జరుగుతున్న మట్టి అక్రమ తవ్వకాలను నిలిపివేసి ప్రభుత్వ భూములను పరిరక్షించాలని కోరుతూ మండల ఎగ్జిక్యూటివ్ తహశీల్దారు కార్యాలయంలో డిటి బలివాడ వెంకటేశ్వరరావు ని కలిసి సమస్యను వివరిస్తూ వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యులు రాజాం పురపాలక సంఘ పరిధి సారధి వార్డులో 'సారధి గెడ్డ' పరిసర ప్రాంతాలలో ప్రభుత్వ భూములలో పలుచోట్ల మట్టి అక్రమ తవ్వకాలను యదేచ్ఛగా ఉన్నాయన్నారు, తద్వారా నిత్యంట్రాక్టర్లతో మట్టి అక్రమ రవాణా కారణంగా రోడ్లు కొన్నిచోట్ల గుంతలు పడడం, రోడ్లన్నీ అధ్వానంగా తయారయ్యాయన్నారు గుంతలు పడ్డ చోట్ల మట్టి వేయటానికి కూడా మట్టి అక్రమ రవాణా దారులు సాహసించడం లేదని ఆవేదన వ్యక్తంచేశారు. ఈ వాస్తవాన్ని తెలిసిన నాయకులు, ప్రజలు తమకేమీ పట్టనట్టు ఉదాసీన వైఖరి అవలంబించడం అత్యంత బాధాకరమైన విషయం అన్నారు, ప్రభుత్వ బంజరు భూములు, ఎండోమెంట్ భూములు, చెరువులు, స్మశాన వాటికలు సంబంధించిన భూములపై ఉదాసీనత వైఖరి అవలంబించరాదని న్యాయస్థానాలు, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పష్టం చేయడం జరిగింది, కావున మండల ఎగ్జిక్యూటివ్ తాసిల్దార్ మరియు సిబ్బందితో కలిసి జరుగుతున్న అక్రమ మట్టి తవ్వకాలను క్షేత్రస్థాయిలో పరిశీలించి ప్రభుత్వం నిబంధన మేరకు హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేసి పరివేక్షించవలసిందిగా భారతీయ జనతా పార్టీ తరఫున మరియు వార్డు ప్రజల తరఫున ఈ వినతిపత్రం అందజేయడం జరిగిందన్నారు, ఈ విషయాన్ని జిల్లా కలెక్టర్ కి నివేదించి తగు చర్యలు చేపట్టాలని కోరుచున్నారు. 3ఎవిసి

నూతన భూ హక్కుల చట్టం వ్యవసాయ భూముల స్థిరాస్తులపై తీవ్ర ప్రభావం

ఏపీ రైతు సంఘం జిల్లా సదస్సును జయప్రదం చేయండి

ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం విజ్ఞప్తి

విశాలాంధ్ర-పాలకొండ: ప్రపంచ బ్యాంకు కనుసన్నలలో పనిచేస్తున్న నీతి అయోగ్ ఆదేశానుసారం రాష్ట్ర ప్రభుత్వం సడిచప్పుడు లేకుండా భూ హక్కుల చట్టం 27/23 తీసుకొచ్చింది. ఈ చట్టం ఫలితంగా భూ హక్కులు మరియు స్థిరాస్తులపై (టైటిల్ రిజిస్టర్ ఆఫీసర్) టి.ఆర్.ఓ పెత్తనం చేస్తూ భూ బకాసురులకు వరంగా ఈ చట్టాన్ని రాష్ట్ర ప్రభుత్వం తీసుకొచ్చిందని, ఈ చట్టంపై జిల్లా సదస్సు మార్చి 1న పాలకొండలో జరుగుతుందని, ఇందులో న్యాయ నిపుణులు కూడా పాల్గొంటారని, కావున అన్ని వర్గాల ప్రజలు హాజరై జయప్రదం చేయాలని ఏపీ రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి బుడితి అప్పల నాయుడు విజ్ఞప్తి చేశారు. సోమవారం సమావేశానికి సంబంధించి కరపత్రం విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2023 అక్టోబర్ 31 నుండి అమలకు వస్తున్నట్టు జీవో నెంబర్ 512 ని ప్రభుత్వం విడుదల చేసిందని, పై చట్టంలో ఉన్న అనేకమైన న్యాయ పరమైన, ప్రమాదకరమైన అంశాలు ఉన్నాయి. దీనిపై ఇప్పటికే న్యాయవాదులు రాష్ట్ర వ్యాప్తంగా వివిధ రూపాల్లో ఆందోళన చేస్తున్నారన్నారు. అయితే వారి ఆందోళనలు ప్రజలకు పట్టడం లేదు ఇది కేవలం న్యాయవాదులు సమస్యగానే ప్రజలు చూస్తున్నారన్నారు. భూములున్న లేదా ఇళ్ల స్థలాలు(సైట్లు), వివిధ రకాల ప్రభుత్వ, బంజరు భూములు ఇప్పటివరకు అనుభవంలో ఉన్న రైతులపై చట్టం వేలాడిన కత్తి లాంటిదన్నారు. ప్రస్తుత భూ యాజమాన్యపు హక్కులుకు సంబంధించి సుమారు 30 వరకు వివిధ రూపాల్లో ఒన్ బి,పట్టాదార్ పాస్ పుస్తకం,అడంగల్ పహాని వంటి రెవెన్యూ రికార్డులు తుడిసిపెట్టుకు పోతాయన్నారు. టి ఆర్ ఓ పరిధిలో ఉన్న వివాదాల పుస్తకంలో ఒకసారి నమోదైతే అటువంటి భూములపై భూ యజమానులకు అమ్ముకొనే, భూ బదరాయింపు చేసుకునే స్వేచ్ఛలు ఉండవని, కొత్తగా వచ్చిన టిఆర్ఓ విధానం వల్ల అప్పటి అధికారంలో ఉన్న ఎమ్మెల్యే, ఎంపీ ల అజమాషి చెలయించే అవకాశముందన్నారు. సమస్యను పరిష్కరించుకోవాలంటే నేరుగా హైకోర్టుకు మాత్రం వెళ్లే వెసులుబాటు ఉందని, కిందస్థాయిలో సామాన్యులకు ఈ శక్తి ఉండదు. కనుక ప్రస్తుత చట్టంపై స్థిర ఆస్తిపరులు అభిప్రాయాలు చెప్పుకునే అవకాశం ఉంది కనుక న్యాయ నిపుణులు కూడా ఈ సదస్సులో పాల్గొంటున్నారన్నారు. కావున అన్ని వర్గాల ప్రజలు రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో సంఘం జిల్లా గౌరవ అధ్యక్షులు గురుబిల్లి అప్పలనాయుడు, కౌలు రైతుల సంఘం జిల్లా అధ్యక్షులు కిమిడి రామ్మూర్తి, సంఘం జిల్లా ఉపాధ్యక్షులు చందక కేశవరావు, బలగలక్ష్మి నాయుడు, జమ్ము చిన్నమనాయుడు తదితరులు పాల్గొన్నారు.

నేడు బూర్జలో జగనన్న ఆరోగ్య సురక్ష

విశాలాంధ్ర-సీతానగరం : మండలంలోని బూర్జగ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో మంగళవారం రెండో విడత జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమం వైద్య నిపుణులచే జరుపబడునని, దీన్ని బూర్జ సచివాలయం పరిధిలోని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని పెదంకలం ప్రాదమిక ఆరోగ్య కేంద్రం వైద్యులు రాధాకాంత్, ప్రభుదాస్ లు తెలిపారు.

ఈనెల 3న పల్స్‌పోలియో

మండలంలోని మార్చి 3న జరగనున్న పల్స్ పోలియో కార్యక్రమంను విజయవంతం చేయాలని ఎంపిడిఓ ఎం ఈశ్వరరావు తెలిపారు. దీనిపై సీతానగరం, పెదంకలం ప్రాదమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులు, సిబ్బందితో సమావేశాన్ని నిర్వహించి లక్ష్యాలు పూర్తి చేయాలని కోరారు. పల్స్ పోలియో చుక్కలు కోసం ఆమూడు రోజుల పాటు విద్యుత్ కోతలు లేకుండా చూడాలని ఎంపిడిఓ కోరారు.

వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తం

డిఎంఓ డా॥ టి. జగన్ మోహనరావు

విశాలాంధ్ర-బెలగాం: వసతిగృహ విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలని జిల్లా మలేరియా అధికారి (డిఎంఓ) డాక్టర్ టి. జగన్ మోహనరావు ఆదేశించారు. సీతానగరం మండలం జోగింపేట పరిధిలో ఉన్న గిరిజన సంక్షేమ రెసిడెన్షియల్ స్కూల్, కెజిబివి, డా. బిఆర్ అంబేద్కర్ గురుకులంలను సోమవారం ఆయన సందర్శించారు. విద్యార్థుల సిక్ రిజిష్టర్స్, ఆరోగ్య తనిఖీ వివరాల రికార్డులు పరిశీలించి ఏ విధమైన ఆరోగ్య సమస్యలు నమోదు అవుతున్నాయి, వారికివ్వబడిన చికిత్స వివరాలు తనిఖీ చేశారు. విద్యార్థుల ఆరోగ్య సమస్యల వివరాలు, పరీక్షల నివేదికలు సిక్ రిజిష్టర్ లో స్పష్టంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు. జ్వరాలు గుర్తించిన విద్యార్థులకు నిర్ధారణ పరీక్షలు వెంటనే జరిపి, తగు మందులు ఇవ్వాలన్నారు. క్షేత్ర స్థాయి వైద్య సిబ్బంది హాస్టల్స్ ను తరుచుగా సందర్శించి విద్యార్థుల ఆరోగ్య పరిశీలన చేయాలని ఆదేశించారు. సిక్ రూంలలో మందులు, కిటికీలకు మెస్ ల అమరిక తీరును ఆయన పరిశీలించారు. కిచెన్ లో పరిశుభ్రత తీరును గమనించారు. వాడుక నీరు పరిసరాల్లో నిల్వ లేకుండా చూసు కోవాలన్నారు. వైద్య సిబ్బంది, హాస్టల్ సిబ్బంది సమన్వయంతో పనిచేసి విద్యార్థుల ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్స్ పోల వెంకట నాయుడు, జె. సంధ్య, కె. ఈశ్వరరావు, వైద్య సిబ్బంది శర్మ, చైతన్య, లావణ్య, హరికృష్ణ, హాస్టల్ హెల్త్ సిబ్బంది, ఆశాకార్యకర్త తదితరులు ఉన్నారు.

మార్చి 1న పాలకొండలో జాబ్ మేళా

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: పాలకొండలో జాబ్ మేళాను మార్చి 1వ తేదీన నిర్వహిస్తున్నట్లు ఇన్‌ఛార్జ్ జాయింట్ కలెక్టర్ మరియు పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి.విష్ణుచరణ్ తెలిపారు. ఈ మేరకు సోమవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో జాబ్ మేళా పోస్టర్ ను విడుదల చేసారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ అధ్వర్యంలో ఉపాధి కల్పనలో భాగంగా పాలకొండ శ్రీ సత్యసాయి డిగ్రీ కాలేజీలో జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఈ మేళాలో 13 కంపెనీ ప్రతినిధులు ఐటీ ఫార్మా హెల్త్ బ్యాంకింగ్ మ్యానుఫ్యాక్చరింగ్ ఆటోమేటిక్ ఎలక్ట్రానిక్స్ కంపెనీల ప్రతినిధులు హాజరవుతారన్నారని, ఈ అవకాశాన్ని నిరోద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. పదవ తరగతి, ఇంటర్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, బి.టెక్, ఎంబీఏ చదివిన అభ్యర్థులు అర్హులని అన్నారు. అభ్యర్థులు తమ వివరాలు స్కిల్ యూనివర్స్ వెబ్‌సైట్‌లో నమోదు చేసుకోవాలని ఇన్‌ఛార్జి జాయింట్ కలెక్టరు తెలిపారు. వివరాలకు 6301275511, 70320 60773, 79937 95796 నంబర్లును సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో ఇన్ ఛార్జి జిల్లా రెవిన్యూ అధికారి జి కేశవ నాయుడు, రెవిన్యూ డివిజనల్ అధికారి కె హేమలత, జిల్లా పరిశ్రమల అధికారి ఎం వి కరుణాకర్, లీడ్ బ్యాంక్ మేనేజర్ జె ఎల్ ఎన్ మూర్తి, నైపుణ్య అభివృద్ధి అధికారి యూ.సాయికుమార్, నైపుణ్య అభివృద్ధి సంస్థ సిబ్బంది పాల్గొన్నారు.

భాష వాలంటీర్ల సమస్యలు పరిష్కరించాలి

విశాలాంధ్ర-సీతంపేట: మండల పరిధిలో సవర భాష వాలంటీర్లుగా మిగిలిన నిర్వహిస్తున్న తమకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ సోమవారం ఆంధ్రప్రదేశ్ గిరిజన సంఘం ఆధ్వర్యంలో ఐటీడీఏ లో ధర్నా చేశారు మార్చి, ఏప్రిల్ నెలలకు సంబంధించి విధుల్లో కొనసాగించాలని ఆ రెండు నెలలకు జీతభత్యాలు చెల్లించాలని కోరారు. అదేవిధంగా 2024- 25 విద్యా సంవత్సరం వరకు రెన్యువల్ చేయాలని, పనికి తగ్గ వేతనం చెల్లించాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా ప్రభుత్వం భాష వాలంటీర్లకు అన్ని విధాలుగా గుర్తించి పూర్తిస్థాయిలో తమను విధుల్లో కొనసాగించి, హక్కులు కల్పించాలని డిమాండ్ చేశారు, అనంతరం ఐటీడీఏ ఏపీవో రోషి రెడ్డికి వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎస్ ఆనందరావు జిల్లా అధ్యక్షులు, ఎస్ దుంబు రాష్ట్ర కార్యదర్శి, ఎం భారతి, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

త్వరలో లబ్ధిదారులకు టిడ్కో గృహాలు అందజేత

విశాలాంధ్ర-పార్వతీపురం టౌన్: ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి నిర్దేశించిన లక్ష్యం మేరకు పార్వతీపురం 768 పురపాలక సంఘాల పరిధిలో టిడ్కో హౌసింగ్ ప్రాజెక్ట్ నిర్మాణ పనుల పూర్తి, శాశ్వత నిరంతర మంచి నీటి సరఫరా తో ఈ మార్చి మొదటి వారములో లబ్ధిదారులకు గృహాల అందించే దిశగా చర్యలు తీసుకోవడం జరుగుతుందని ఏపీ టిడ్కో చైర్మన్ జమ్మాన. ప్రసన్నకుమార్, స్థానిక శాసనసభ్యులు అలజంగి జోగారావు అన్నారు. సోమవారం అడ్డాపు శీల ప్రాంతంలో నిర్మిస్తున్న గృహ సముదాయాన్ని ఇంజనీరింగ్ అధికారులతో కలిసి పర్యవేక్షించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మార్చి 2024 నాటికి ఒక లక్షా యాభై వేలు టిడ్కో గృహాలను లబ్ధిదారులు కు అందించాలని ముఖ్యమంత్రి వై.ఎస్. జగన్ మోహన్ రెడ్డి నిర్దేశించిన లక్ష్యాన్ని పూర్తి చెయ్యాలనే దిశగా పార్వతీపురం పురపాలక సంఘం పరిధిలో నిర్మాణములో ఉన్న 768 ఏ.పి.టిడ్కో గృహ సముదాయాలలో జరుగుతున్న నిర్మాణ పనులను ఇంజనీరింగ్ అధికారులు మరియు కాంట్రాక్టింగ్ ఏజెన్సీ సిబ్బందితో కలిసి పరిశీలించడం జరిగిందన్నారు.ఈ హౌసింగ్ ప్రాజెక్టులో ఉన్న గృహ సముదాయలకు నిరంతర మంచి నీటి సరఫరా అందించే దిశగా సుమారుగా 12 కోట్ల వ్యయంతో చేస్తున్న వాటర్ సప్లై పనులను పర్యవేక్షిస్తూ ఆయా పనుల సత్వర పూర్తి కొరకు పలు కీలక సూచనలు చేస్తూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఈ మార్చి చివరి నాటికి అన్ని సదుపాయాలతో ఇళ్ళ నిర్మాణాలను పూర్తి చేసి లబ్ధిదారులకు మార్చి మొదటి వారం లో అందజేసేందుకు సమిష్టిగా కృషి చేయాలని అధికారులకు ఏజెన్సీ సిబ్బందికి సూచించారు.ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, కమిషనర్ సింహాచలం పలువురు కౌన్సిల్ సభ్యులు పాల్గొన్నారు.

రైల్వే స్టేషను ఆధునికీకరణ పనులకు శంఖుస్థాపన

విశాలాంధ్ర-బెలగాం : పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ ఆధునికీకరణ పనులకు సోమవారం శ్రీకారం చుట్టారు. అమృత్ భారత్ స్టేషన్ పథకంలో భాగంగా దేశ వ్యాప్తంగా రూ.41 వేల కోట్లతో ఆధునీకరించిన 554 రైల్వేస్టేషన్లు, 1500 రోడ్డు ఓవర్ బ్రిడ్జిలు, అండర్ పాస్ లను ప్రధానమంత్రి నరేంద్ర మోడి సోమవారం వీడియో కాన్ఫరెన్స్ మాధ్యమం ద్వారా ప్రారంభం, శంఖుస్థాపన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ పథకంలో పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ ఉండటం విశేషం. రైల్వే స్టేషన్ అభివృద్ధి పనులకు ప్రధాన మంత్రి శంఖుస్థాపన చేశారు. రూ. 14.76 కోట్లతో ఈ పనులు జరగనున్నాయి. విశాఖపట్నం డివిజన్ లో 12 రైల్వే స్టేషన్ లు - పార్వతీపురం, సింహాచలం, కొత్తవలస, చీపురుపల్లి, శ్రీకాకుళం, నౌపడ, పర్లాకిమిడి, బొబ్బిలి, రాయగడ, కోరాపుట్, అరకు, జైపూర్ ఉన్నాయి. ఈ స్టేషన్లు రూ.500 కోట్ల పెట్టుబడితో ఆధునీకరించడం జరుగుతుంది. రూ.170 కోట్ల అంచనా వ్యయంతో 4 రోడ్డు ఓవర్ బ్రిడ్జిల పనులకు కూడా శంఖుస్థాపన జరిగింది. పార్వతీపురం (బెలగాం) రైల్వే స్టేషన్ లో భవనాల ఆధునీకరణ, వెయిటింగ్ హాల్స్, కెఫేటేరియా, స్థానిక ఉత్పత్తుల విక్రయానికి స్టాల్, ఫ్లాట్ ఫార్మ్, అప్రోచ్ రోడ్డు, పార్కింగ్, పాదచారులకు దారి, లాండ్ స్కేపింగ్, ఆధునిక లైటింగ్ తదితర పనులను చేపట్టనున్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్, రైల్వే అధికారులు, వివిధ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు. జిల్లా కలెక్టరు నిశాంత్ కుమార్ మాట్లాడుతూ పార్వతీపురం రైల్వే స్టేషన్ పనులు చారిత్రాత్మకం అన్నారు. అంతర్జాతీయ స్థాయి సౌకర్యాలు వస్తాయని చెప్పారు. రైల్వే స్టేషన్ అభివృద్ధి వలన పార్వతీపురం చుట్టు పక్కల అన్ని రంగాల్లో అభివృద్ధికి దోహదం జరుగుతుందని తద్వారా ఆర్థిక పురోగతికి నాంది పలుకుతుందని అన్నారు. 22 ఎక్స్ ప్రెస్ రైళ్లు నడుస్తాయని పేర్కొన్నారు. రవాణా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు వస్తాయని అన్నారు. ఈ సందర్భంగా నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. పాఠశాలల విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు ప్రదర్శించారు. ఈ కార్యక్రమంలో మునిసిపల్ చైర్ పర్సన్ బోను గౌరీశ్వరి, రైల్వే చీఫ్ మెకానికల్ ఇంజనీర్ కెకెపి గుప్తా, సీనియర్ డివిజనల్ ఇంజనీర్ సంజయ్ కుమార్ మీనా, చీఫ్ కమర్షియల్ ఇన్స్పెక్టర్ పి. రవికిరణ్, స్టేషన్ సూపరింటిండెంట్ పి. శ్రీనివాసరావు, వివిధ పార్టీల ప్రతినిధులు ద్వారపురెడ్డి జగదీష్, బోనెల విజయ చంద్ర, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, నిమ్మక జయరాజు, తదితరులు పాల్గొన్నారు.

పాడైన కొళాయిలు తక్షణం బాగుచేయించి నీరు వచ్చేలా చూడాలి

మూలవలస గ్రామ మహిళలు ఖాళీ బిందెలతో నిరసన



విశాలాంధ్ర-మక్కువ : మక్కువ మండలం పనసభద్ర పంచాయతీ, గ్రామమైన మూలవలసలో ఇంటింటికి కొలాయిల పథకంలో భాగంగా గత సంవత్సరం కొళాయిలను ఏర్పాటు చేశారు. అయితే ఆ తరువాత కొన్ని నెలలకే కొళాయిలు పాడైపోయాయి. దాదాపు మూడు నెలల నుంచి కొళాయిల ద్వారా సరిగ్గా నీరు రావడం లేదు. ఈ విషయంపై పలుమార్లు పంచాయతీ ప్రెసిడెంట్ దగ్గరకు వెళ్లి అడగగా అది మాకు సంబంధం లేదని జెఏ చేయవలసిన పని అని చెప్పారు. దాంతో జెఏని కలవగా కొళాయిలు వేసేవరకే మా బాధ్యత అని తరువాత కొళాయిలు పాడైనా.. ఎటువంటి సమస్యలు వచ్చిన పంచాయతీ ప్రెసిడెంట్, సెక్రటరీలే చూసుకోవాలని చెప్పారు. దీంతో మహిళలు సోమవారం ఖాళీ బిందెలతో నిరసన తెలియజేశారు. రైతు కూలీ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు పీడిక అసిరి ఆ గ్రామ మహిళలను ఈ సమస్యపై ప్రశ్నించగా ఆ గ్రామ మహిళలు ఇంటింటికి కొళాయిలు ఇవ్వకముందు నీరు రోజంతా వచ్చేదని కానీ ఈ కుళాయిలు పెట్టిన తర్వాత ఒక గంట కూడా సరిగ్గా రావడంలేదని ఇప్పుడు అవి కూడా పాడైపోయాయన్నారు. అలాగే ఇంతకుముందు కాలువ ఉన్న ప్రదేశంలో మాత్రమే కొళాయిలు ఉండేవని ఈ పథకంలో భాగంగా కాలవలు లేని ప్రాంతంలో కూడా కొళాయిలు వేయడంతో ఈ కొళాయిల లీకేజీ కారణం గా ఆ ప్రాంతమంతా బురద బురదగా తయారైందని రోడ్లమీద నడవాలంటే ఇబ్బంది పడవలసి వస్తుందని అన్నారు. కుళాయిలు వేసే సందర్భంలో కాలవలు ఉన్న ప్రాంతంలో కొళాయిలు వేయాలని అడగ్గా అలా వెయ్యకుండా అడ్డదిడ్డంగా కొళాయిలు వేశారని వాపోయారు. ఈ సమస్యను ఎన్నిసార్లు పంచాయతీ స్థాయి అధికారుల దగ్గరకు ప్రెసిడెంట్ దగ్గరకు, జెఏ దగ్గరకు తీసుకువెళ్లిన పరిష్కారం కావడం లేదని అందుకే తాము నిరసన తెలియజేశామని అన్నారు. ఈ నిరసనలో మాజీ ప్రెసిడెంట్ రత్నాల పార్వతమ్మ, ప్రస్తుత పంచాయతీ వార్డు మెంబర్లు మర్రిబుగిలమ్మ, తాడంగి పార్వతి, అలాగే మర్రి అమ్ముడమ్మా, మర్రి నీలమ్మ తదితరులు పాల్గొన్నారు.

సత్య కళాశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : స్థానిక తోట పాలెం లో గల సత్య డిగ్రీ మరియు పీజీ కళాశాల విద్యార్థులు ఎస్. పల్లవి, బి ఎ ద్వితీయ సంవత్సరం, సి హెచ్ శ్రీలక్ష్మి, బి ఎ ప్రథమ సంవత్సరం వీరిద్దరూ ఫిబ్రవరి 19 నుండి 23వ వరకు ఇటానగర్, అరుణాచల్ ప్రదేశ్ లో జరిగిన ఖేలో ఇండియా యూనివర్శిటీ గేమ్స్ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీలలో వివిధ విభాగాల్లో పతకాలు సాధించారు. ఎస్ పల్లవి 64 కేజీల విభాగంలో స్నాచ్ -80 కేజీలు, జర్క్-95కేజీలు మొత్తం 175 కేజీలు పూర్తి చేసి రజిత పతకం, సి హెచ్ శ్రీలక్ష్మి 81 కేజీల విభాగంలో స్నాచ్ -85 కేజీలు, జర్కు 100 కేజీలు మొత్తం 185 కేజీలు పూర్తిచేసి బంగారు పతకం సాధించింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన సభలో కళాశాల సంచాలకులు డాక్టర్ ఎం శశి భూషణ రావు , కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎం వి సాయి దేవ మణి, కళాశాల ఎన్ సి సి ఆఫీసర్లు కెప్టెన్ ఎం సత్య వేణి, ఎం ఉదయ్ కిరణ్, ఎన్ ఎస్ ఎస్ ఆఫీసర్ బి. సూ రపు నాయుడు వెయిట్ లిఫ్టింగ్ కోచ్ చల్లా రాము, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొని అభినందనలు తెలియజేశారు. మరియు విజేతలకు నగదు బహుమతిని కూడా అందజేశారు. శశి భూషణ రావు గారు మాట్లాడుతూ భవిష్యత్తు లో జరిగే జాతీయ అంతర్జాతీయ వెయిట్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ పోటీల్లో ఇంకా రాణించాలని కళాశాల నుంచి ప్రోత్సాహం వుంటుందన్నారు

మార్చి 3న పల్స్ పోలియో : జేసీ విష్ణుచరణ్

విశాలాంధ్ర-బెలగాం: పల్స్‌పోలియో కార్యక్రమాన్ని మార్చి 3న నిర్వహిస్తున్నట్లు ఇంచార్జి జాయింట్ కలెక్టర్ సి. విష్ణు చరణ్ తెలిపారు. పల్స్ పోలియో నిర్వహణపై జిల్లా స్థాయి టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఐదు సంవత్సరాల లోపు వయస్సు గల పిల్లలు 98,991 మంది ఉన్నట్లు అంచనా ఉందన్నారు. వీరందరికీ పోలియో చుక్కలు వేసి పోలియో మహమ్మారి సోకకుండా చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఇందుకు 905 బూత్ లు ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. 19 ట్రాన్సిట్ బూత్ లు, 42 మొబైల్ బృందాలు పని చేస్తాయని, 93 మందిని రూట్ సూపర్ వైజర్లుగా నియమించామని చెప్పారు. జిల్లా స్థాయిలో 9 మంది పర్యవేక్షక అధికారులను నియమించడం జరిగిందని అన్నారు. 30 ఇటుకల తయారీ ప్రాంతాలను గుర్తించామని అచ్చట 132 మంది పిల్లలు ఉన్నట్లు గుర్తించడం జరిగిందన్నారు. పట్టణాల్లో గల 71 మురికివాడల్లో 1,768 మంది చిన్నారులు ఉన్నారని, ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు పడాలని అందుకు అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలని స్పష్టం చేశారు. పోలియో చుక్కలు పంపిణీ, రవాణా సకాలంలో జరగాలని ఆయన ఆదేశించారు. పక్కా ప్రణాళికలు తయారు చేయాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరికీ కార్యక్రమం వివరాలు తెలియాల్సిన అవసరం ఉందని, ఐసిడిఎస్, ఆశాలు విస్తృత స్థాయిలో పని చేయాలని, పాఠశాలల్లో పోలియో చుక్కలు వేసే కార్యక్రమానికి విద్యా శాఖ అధికారులు తగిన ఆదేశాలు జారీ చేయాలని ఆయన స్పష్టం చేశారు. మండల పరిషత్ అధికారులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు పాల్గొని విజయవంతం చేయాలని, విద్యుత్ అంతరాయం కలుగకుండా విద్యుత్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయన ఆదేశించారు. చిన్నారుల తల్లిదండ్రులు తమ పిల్లలకు పోలియో చుక్కలు వేయించాలని కోరారు.

ఈ సందర్భంగా పల్స్ పోలియో పోస్టర్లను విడుదల చేసారు. ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా రెవిన్యూ అధికారి జి. కేశవ నాయుడు, పార్వతీపురం రెవిన్యూ డివిజనల్ అధికారి కె. హేమలత, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. బగాది జగన్నాథరావు, ఆరోగ్య శ్రీ జిల్లా సమన్వయ అధికారి డా. కొయ్యాన అప్పారావు, జిల్లా ఇమ్మ్యునైజేషన్ అధికారి ఎం. నారాయణరావు, జిల్లా రవాణా అధికారి సి. మల్లిఖార్జున రెడ్డి, విద్యా శాఖ సహాయ సంచాలకులు ఎం.ఇ రమాజ్యోతి, జిల్లా మహిళ శిశు సంక్షేమ అధికారి ఎంఎన్ రాణి, జిల్లా పరిశ్రమల అధికారి ఎంవి కరుణాకర్, ఇపిడిసిఎల్ ఇఇ వి. కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

శ్రీ ఆదిలక్ష్మి జ్యూయలర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మెయిన్ రోడ్డులో ముంతాజ్ రెస్టారెంట్ ఎదురుగా నూతనంగా ఏర్పాటు చేసిన శ్రీ ఆదిలక్ష్మి జ్యూయలర్స్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో శృంగవరపుకోట నియోజకవర్గ ఇంచార్జ్ & మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి పాల్గొన్నారు. అనంతరం టీడీపీ నాయకులతో కలిసి జ్యూయలర్స్ లో ఉన్న ఆభరణాలను పరిశీలించారు. శృంగవరపుకోట లాంటి చిన్న పట్టణంలో శ్రీ ఆదిలక్ష్మి జ్యూయలర్స్ తన మొదటి బ్రాంచిని ప్రారంభించడం పట్ల హర్షం వ్యక్తం చేశారు. ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన బంగారు ఆభరణాలు అందుబాటులోకి తీసుకొచ్చిన ఆదిలక్ష్మి జ్యూయలర్స్ అధినేత పెనగంటి నాయుడుని అభినందించారు. కార్యక్రమంలో ఎస్.కోట మండల మాజీ వైస్ ఎంపీపీ నానిగిరి రమణాజీ, పట్టణ అధ్యక్షులు మల్లేశ్వరరావు, పొట్నూరు అప్పలరాజు (సాయిరాం), రాష్ట్ర ఐటీడీపీ కార్యదర్శి చక్కా కిరణ్,క్లస్టర్ ఇంచార్జ్ కాపుగంటి వాసు, మాజీ ఎంపిటిసి గన్ను బంగారమ్మ, బోనంగి జ్యోతి, హైటెక్ సురేష్, సరిపిల్లి రామకృష్ణ,పెదగడ రాజు మరియు తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

ఓటు సామాన్యుడి చేతిలో ఆయుదం

ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ

విశాలాంధ్ర-చీపురుపల్లి: ఓటు సామాన్యుడి చేతిలో ఆయుదం.. ఆశయ యూత్ అసోసియేషన్ అధ్యక్షుడు రెడ్డి రమణ అన్నారు. చీపురుపల్లి మండలం పుర్రేవలస గ్రామంలో ఆశయ యూత్ అసోసియేషన్ మరియు నెహ్రూ యువ కేంద్రం వారి ఆధ్వర్యంలో ప్రజలకు యువతకు ఓటు హక్కు, నమోదు అవగాహన సదస్సు నిర్వహించారు. కార్యక్రమంలో ఆశయ సంస్థ అధ్యక్షుడు రెడ్డి రమణ మాట్లాడుతూ ఓటు వున్న వారు ఓటుహక్కును వినియోగించుకొని సమాజానికి ఉపయోగ కరమైన, నాయకులను ఎనుకోవాలని ధనరాజకీయాలు పోయి జన రాజకీయాలు రావాలి. ప్రజలకు మేలుచేసే వారు ఎన్నికవ్వాలి. రాజ్యాంగం కల్పించిన ఓటుహక్కు ను మరువకుండా వినియోగించాలి. ఓటును ఆయుధంగా ఎక్కుపెట్టాలని. 18 సంవత్సరాల నిండిన యువత ఓటు హక్కు నమోదు చేసుకోవాలని అన్నారు. అనంతరం యువతచే ప్రతిజ్ఞా చేయించారు. కార్యక్రమంలో నెహ్రూ యువ కేంద్రం. వాలెంటర్ యు. హరి యంవత పాల్గొన్నారు.

టీడీపీ,జనసేన పార్టీని వీడి వైసీపీలోకి 20 కుటుంబాలు

విశాలాంధ్ర-రాజాం : రాజాం నియోజకవర్గం రేగిడి అమదాలవలస మండలం బాలకావలస గ్రామం నుంచి టీడిపి- జన సేన పార్టీల నుంచి 20 కుటుంబాలు, సర్పంచ్ చంద్రశేఖర్ మరియు యువ నాయకుడు కార్తిక్ ఆధ్వర్యంలో రాజాం నియోజకవర్గం ఇంచార్జి డా. తలే. రాజేష్ సమక్షంలో వైఎస్సార్సీపీ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వాళ్ళు అందరికీ డా. తలే. రాజేష్ వైఎస్సార్సీపీ కండువాలు వేసి పార్టీలోకి ఆహ్వానించారు.

పీఆర్టీయు విజయనగరం జిల్లా శాఖ కార్యదర్శిగా సంత గవిరమ్మపేట హెచ్.ఎం బంగారునాయుడు

విశాలాంధ్ర-శృంగవరపుకోట : పీఆర్టీయు విజయనగరం జిల్లా శాఖ కార్యదర్శిగా ఎస్.కోట మండలం లోని సంతగవిరమ్మపేట ప్రాథమికోన్నత పాఠశాల హెచ్.ఎం కె.బంగారునాయుడుని నియమించినట్లు మాజీ ఉపాధ్యాయ ఎమ్మెల్సీ గాదె శ్రీనివాసులు నాయుడు ప్రకటించారు. పీఆర్టీయు రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఇందుకూరి అశోక్ రాజు జన్మదిన వేడుకలకు హాజరైన ఆయన ఈ సందర్భంగా పీఆర్టీయు గెజిట్ ను విడుదల చేశారు. అనంతరం మాజీ ఎమ్మెల్సీ గాదె మాట్లాడుతూ శ్రమించే స్వభావం, సేవాభావం గల బంగారు నాయుడు వంటి వారికి జిల్లా కార్యదర్శిగా సముచిత స్థానం కల్పించామన్నారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు ఇందుకూరి అశోక్ రాజు మాస్టారు మాట్లాడుతూ బంగారు నాయుడు మాస్టారు ఉపాధ్యాయులకు చేసిన సేవలే అతనికి గుర్తింపు తెచ్చాయని, కరోనా కష్ట కాలం తరువాత , కరోనాతో మరణించిన ఉపాధ్యాయుల పిఎఫ్, జిఐఎస్, ఏపిజి ఎల్ఐ, దహన సంస్కార ఖర్చుల బిల్లు పెట్టి ప్రభుత్వం నుంచి తెప్పించి ఆయా కుటుంబ సభ్యులకు అందజేయడంలో ఎనలేని కృషిచేశారని, అటువంటి వ్యక్తికి ఉన్నత స్థానం కల్పించడం మాఅందరి బాధ్యత అని హర్షధ్వానాల మధ్య ప్రకటించారు. రాష్ట్ర కార్యనిర్వాహక సభ్యులు మోహన్ రాజు మాట్లాడుతూ బంగారు నాయుడు మాస్టారులో శ్రమ, సేవాభావం రెండు కళ్ళు వంటివని కొనియాడారు. అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.సూరిబాబు, అప్పారావు మాట్లాడుతూ బంగారునాయుడు కలయికతో మండల పీఆర్టీయు శాఖ మరింత బలోపేతం అవుతుందని అన్నారు. నూతన కార్యదర్శి బంగారు నాయుడు మాట్లాడుతూ ఎన్నో ఏళ్లుగా పరిష్కారం కాని ఉపాధ్యాయ సమస్యలు అప్రాంటిస్ రద్దు, ఉమ్మడి సర్వీస్ రూల్స్ కి రాష్ట్రపతి ఆమోదం వంటి సమస్యల పరిష్కారం కోసం ఎనలేని కృషి చేసిన శ్రీనివాసులు నాయుడు నాయకత్వంలో పని చేసి ఆయన వెంట నడవడానికి నిర్ణయించుకున్నానని, ఉపాధ్యాయ సమస్యల పరిస్కారినికి, విద్యాభివృద్ధికి రాబోయే ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లో శ్రీనివాసులు నాయుడుని ఎమ్మెల్సీగా గెలిపించు కోవాలని పిలుపునిచ్చారు. కాగా బంగారు నాయుడు మాస్టర్ 25 సంవత్సరాలు ఉపాధ్యాయునిగా, 4 సంవత్సరాల ఎమ్మార్పీగా, 3 సంవత్సరాలు అకడమిక్ కో ఆర్డినేటరుగా పనిచేసిన అనుభవం ఉపాధ్యాయుల సర్వీసు, పాఠశాల విద్యా విషయాలు పట్ల అవగాహన గల వ్యక్తిగా, జిల్లా ఉత్తమ ఉపాధ్యాయునిగా మంచి గుర్తింపు ఉందన్నారు. బంగారు నాయుడు మాస్టారుని పలువురు ఉపాధ్యాయులు, సోదర ఉపాధ్యాయ సంఘ నాయకులు సి హెచ్ సూరి బాబు, ఎన్.ఈశ్వర రావు, అలమండ రాము అభినందించారు. ఈ కార్యక్రమంలో పీఆర్టీయు ఆర్గనైజర్ అల్లు సురేష్, రాష్ట్ర కార్య వర్గ సభ్యులు మధు మోహన్, ఎంటీఎస్ విభాగం అధ్యక్షులు ఎల్. వెంకటరావు, మండల పీఆర్టీయు అకడమిక్ విభాగం కె.శ్రీరామ్మూర్తి పాల్గొన్నారు.

6646 మంది చిన్నారులకు పోలియోచుక్కలు లక్ష్యం

సిబ్బంది శిక్షణలో డాక్టర్ హారిక

విశాలాంధ్ర-శృంగవరపుకోట: ఎస్.కోట మండలంలోని కొట్టాం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలో ఉన్న 6646 మంది 0-5 లోపు వయసున్న చిన్నారులకు పల్స్ పోలియో చుక్కలు వేయడం లక్ష్యంగా నిర్దేశించినట్టు పీహెచ్సీ వైద్యాధికారి జె.హారిక తెలియజేశారు. ఎస్.కోట ఎంపీడీఓ కార్యాలయ సమావేశ భవనంలో పీహెచ్సీ సిబ్బంది, అంగన్వాడీ వర్కర్లు, ఆశా కార్యకర్తలకు మార్చి 3వ తేదీ నుంచి 5వ తేదీ వరకు నిర్వహించనున్న పల్స్ పోలియో కార్యక్రమంపై సోమవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా వైద్యాధికారులు హారిక, శిరీష మాట్లాడుతూ మండలంలో ఐదేళ్ళ లోపు చిన్నారులకు పోలియో చుక్కలు మందు వేసేందుకు గాను 34 బూతులు, ఎస్.కోట ఆర్టీసీ కాంప్లెక్స్ లో ఒక ట్రాన్సిట్ హాల్ట్ ఏర్పాటు చేశామని, ఇందుకోసం మూడు రూట్లుగా విభజించామని, ఒక మొబైల్ టీమ్ తిరుగుతుందని వెల్లడించారు. మొత్తంగా 72 గ్రామాల్లో పోలియో చుక్కలు మందు వేసే కార్యక్రమం విజయవంతం చేసేలా ప్రణాళికను రూపొందించినట్లు తెలిపారు. ఇక రాతి క్వారీలు, ఇటుక బట్టీలు తదితర మారుమూల ప్రాంతాల్లో పని చేస్తున్న వారి కుటుంబాలను సందర్శించి వారిలో ఐదేళ్ల లోపు చిన్నారులు మిస్ కాకుండా పోలియో చుక్కలు మందు వేయాలని డాక్టర్ హారిక ఆదేశించారు. ఈ క్రమంలో ప్రతి ఇంటిని జల్లెడపట్టి అప్పుడే పుట్టిన బిడ్డ నుంచి 5ఏళ్ల లోపు చిన్నారులకు ప్రతి ఒక్కరూ బాధ్యతతో పోలియో చుక్కలు మందు వేసి లక్ష్యం పూర్తి చేయాలని సూచించారు. ఈ శిక్షణ కార్యక్రమంలో డాక్టర్ శిరీష, సీహెచ్ఓ ఎం.తారకరావు, సూపర్వైజర్ రామసత్యం, ఎంపీహెచ్ఈఓ వి.సన్యాసినాయుడు, హెల్త్ అసిస్టెంట్లు టి.శంకరరావు, రామకృష్ణ, జె.రాము, సీహెచ్ కృష్ణ,

గిరిజన విద్యార్థుల మరణాలపై విశాత్రి ఐఏఎస్ అధికారిచే విచారణ చేయాలి

విశాలాంధ్ర-గుమ్మలక్ష్మీపురం: పార్వతీపురం మన్యం జిల్లా లో గత పది రోజులులో వరసగా గిరిజన విద్యార్థులు మరణాలు జరుగుతున్నా కనీసం విచారణ చెయ్యకపోగా కింద స్థాయి అధికారులును సస్పెండ్ చేయడంతో సరిపెట్టుకోవడం అనేది చాలా అన్యాయం. ఈ రాష్ట్రంలో చూసుకున్నట్లయితే కేవలం గిరిజన విద్యార్థులు మాత్రమే ఎక్కువగా మరణించడం జరుగుతుంది. దీనిపై వెంటనే ఒక విశ్రాంతి ఐఏఎస్ ఆఫీసర్ తో ఒక కమిటీ వేసి సమగ్ర విచారణ చేసి దీనిలో ఉన్న లోపాలను గుర్తించి ప్రభుత్వం వెంటనే దాని పై చర్య తీసుకోవాలని చెప్పి ఈ సందర్భంగా తెలియజేయడం జరిగింది .అలాగే ఆశ్రమ పాఠశాల లోనూ కళాశాల వసతి గృహాల్లో కచ్చితంగా హెల్త్ వాలంటరీలని నియమించాలని చెప్పి తెలియ జేస్తున్నాం. మరణించిన విద్యార్థులు కుటుంబాలకి ఒక ప్రభుత్వ ఉద్యోగం 10 లక్షలు ఎక్సగ్రేసియ కూడా ప్రకటించాలని ప్రభుత్వాన్ని కోరడం జరుగుతుంది. ఈ మరణాలపై తక్షణమే ప్రభుత్వ పెద్దలు బాధ్యత వహించి సంబంధిత అధికారులు ప్రజాప్రతినిధులు స్పందించాలని చెప్పి తెలియజేయడం జరుగుతుంది. మరణించిన విద్యార్థి కుటుంబాలని కనీసం ఈరోజుకి కూడా పరామర్శిం చకపోవడం చాలా విచారకరం. రాష్ట్రంలో చూసుకున్నట్లయితే కేవలం గిరిజన విద్యార్థులు మాత్రమే ఎక్కువగా మరణిస్తున్నారు కావున ఇటువంటి విషయం ఎందుకు జరుగుతుందని సమగ్ర పరిశోధన చేసి దానికి తగ్గ విషయాలని ప్రభుత్వం పట్టించుకోని భవిష్యత్తులో ఇటువంటి

టిడిపి పార్టీ ఏకపక్ష నిర్ణయం తీసుకుంది...

నెల్లిమర్ల టికెట్ పై పార్టీ పెద్దలు పునరాలోచించాలి

అవసరమైతే స్వతంత్ర అభ్యర్థిగా పోటీలోకి : కర్రోతు సత్యనారాయణ

విశాలాంధ్ర-భోగాపురం : నెల్లిమర్ల టిడిపి ఇంచార్జి కర్రోతు బంగార్రాజుకు టికెట్ రాకపోవడంతో తీవ్ర నైరాశ్యానికి గురైనట్టు మండల టీడీపీ అధ్యక్షుడు కర్రోతు సత్యనారాయణ తెలిపారు. తాము రాజకీయాలలోకి వచ్చినప్పటి నుండి తెలుగుదేశం పార్టీలోనే ఉన్నామని అన్నారు. గతంలో బలమైన కాంగ్రెస్ నాయకులకు ఎదురొడ్డి వ్యయ ప్రయాసలకు లోనై తెలుగు దేశం పార్టీని నిలబెట్టామని అన్నారు. మాజీ మంత్రి నారాయణస్వామి నాయుడు టిడిపి పార్టీ తరపున గెలిచిన ప్రతీసారి అతని విజయంలో తాము కీలక పాత్ర పోషించామని అన్నారు. నియోజకవర్గంలో చతికిలపడిన పార్టీని నేను, మా తమ్ముడు బంగార్రాజు ఎంతో శ్రమించి పార్టీకి జవసత్వాలు తీసుకువచ్చామని అన్నారు. స్థానిక ఎన్నికలలో రాష్ట్రమంతా ఎదురుగాలి వీచినా భోగాపురం మండలంలో వైసిపితో పోరాడి పార్టీని నిలబెట్టమన్నారు. అలాగే మొన్న పోలిపల్లిలో జరిగిన శంఖారావం సభ విజయవంతం చేయడానికి నాలుగు మండలాల కార్యకర్తలు నియోజకవర్గ టిడిపి నాయకులతో కలసి మేము ఎంతో శ్రమించామని అన్నారు. మాకు అధికారం లేకపోయినా కష్టనష్టాలకు ఓర్చి కార్యకర్తల్లో ఉత్సాహం నింపి పార్టీ కోసం అహర్నిశం పాటుపడ్డామని తెలిపారు. కానీ పార్టీ వీటినేవి పరిగణలోనికి తీసుకోకుండా ఏకపక్షంగా వ్యవహరించారని విమర్శించారు. నెల్లిమర్ల టిడిపి, జనసేన ఉమ్మడి అభ్యర్థిగా లోకం మాధవిని ప్రకటించే ముందు నియోజకవర్గంలో ఉన్న టిడిపి నాయకులను సంప్రదించకపోవడం విడ్డురంగా ఉందని, ఈ నిర్ణయం మా అందరిని విస్మయానికి గురిచేసిందని అన్నారు. శతశాతం టిడిపి గెలిచే ఈ నెల్లిమర్ల టికెట్ ను ఏ సర్వేలు చూసి జనసేనకు కేటాయించారో అని ఎద్దేవా చేసారు. ఈ నిర్ణయాన్ని తాము స్వాగతించటం లేదని, తెలుగుదేశం పార్టీ పెద్దలు ఈ విషయాన్నిపునరాలోచించాల్సిన అవసరం ఉందని అన్నారు. అవసరమైతే స్వతంత్రంగా పోటీకి దిగే ఆలోచనలో ఉన్నట్లు తెలిపారు.

కర్రోతు బంగార్రాజుకే నెల్లిమర్ల టిడిపి సీటు కేటాయించాలి

విశాలాంధ్ర-పూసపాటిరేగ : మండలంలో ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్ లో తెలుగుదేశం పార్టీ మాజీ వైస్ ఏఎంసీ చైర్మన్ ఇజ్జురోతు ఈశ్వర్‌రావు ఆధ్వర్యంలో పూసపాటిరేగ మండల టీడీపీ నాయకులు కార్యకర్తల సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మండలంలోని 28 పంచాయితీలకు గాను 20 పంచాయితీలు నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు. ఈ సమావేశంలో టీడీపీ విజయనగరం పార్లమెంటు ఉపాధ్యక్షులు ఆకిరి ప్రసాద్ మాట్లాడుతూ నియోజకవర్గంలో బీసీ సామాజికవర్గం ఎప్పుడూ కూడా ఈ నియోజకవర్గ ఎమ్మెల్యేలుగా బీసీ నాయకులు ఎమ్మెల్యేలు అవ్వటం జరిగిందని, తెలుగు దేశం-జనసేన పార్టీ ఉమ్మడి అభ్యర్థిగా ఓసీకి ఇవ్వడం తీవ్రంగా ఖండిస్తున్నామని, తెలుగుదేశం పార్టీలో ఏ ఒక్క బీసీ నాయకుడికి ఎమ్మెల్యే అభ్యర్థిగా ఇచ్చినా ఖచ్చితంగా గెలిపించుకు తీరుతామని అన్నారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీలో ఉన్న నాయకులకు తీవ్ర అన్యాయం జరిగిందని భవిష్యత్తు కార్యాచరణ మండల పార్టీ నాయకులతో చర్చించి తెలుపుతామని అదే విధంగా కర్రోతు బంగార్రాజు ఏ నిర్ణయం తీసుకుంటారో ఆ నిర్ణయానికి కట్టుబడి ఉంటామని చెప్పారు. ఈ సంద ర్భంగా వెంపడాపు సూర్యనారాయణ మాట్లాడుతూ బంగారు రాజు స్వతంత్ర అభ్యర్థిగా నిలబడితే మా సహకారం పూర్తిగా ఉంటుందని లేనిచో మాలో ఒకరు స్వతంత్ర అభ్యర్థిగా నిలబడతామని జనసేనకు ఈ టికెట్లు ఇవ్వటాన్ని తాము పూర్తిగా జీర్ణించుకోలేక పోతున్నామన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర మత్స్యకార సభ్యులు భూలోక మాట్లాడుతూ కనీసం పార్టీ అధినాయకత్వం ఒక్కమాట కూడా చెప్పకుండా జనసేనకు ఈ టికెట్ కేటాయించడం చాలా బాధాకరమని అన్నారు. రాష్ట్ర మత్స్యకార కార్యదర్శి మైలిపిలి సింహాచలం మాట్లాడుతూ ఖచ్చితంగా టీడీపీ అభ్యర్థికి ఈ టికెట్ కేటాయించినట్లయితే గెలిపించి చంద్రబాబునాయుడుకి బహుమతిగా ఇస్తామన్నామన్నారు. ఈ సందర్భంగా సర్పంచ్ గోవింద మాట్లాడుతూ బంగార్రాజు ఎన్నో వ్యయ ప్రయాసలుపడి ఇటు ఆర్థికంగా, సామాజికంగా రాజకీయంగా అన్ని విధాలుగా పార్టీ కోసం సేవలందించిన నాయకుడిని గుర్తించకపోవడం బాధాకరం అన్నారు. మండల పార్టీ మహిళా అధ్యక్షురాలు మంగమ్మ మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ టికెట్టు కేటాయించని ఎడల తెలుగుదేశం పార్టీ ఈ మండలంలో కనుమరుగయ్యే అవకాశం ఉంది అందుకే పార్టీ పునర్ ఆలోచన చేసి తమ నిర్ణయాన్ని సాధ్యమైనంత త్వరలో తెలియజేయవలసిందిగా కోరుతున్నామన్నారు. నెల్లిమర్ల నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు కిషోర్ మాట్లాడుతూ బంగార్రాజు కి టికెట్ ఇవ్వకపోతే నా పదవి కి రాజీనామా చేయటానికి వెనుకాడని అన్నారు.

నియోజకవర్గ ఎస్.సి సెల్ అధ్యక్షులు హరి, మండల తెలుగు యువత అధ్యక్షులు జగదీష్ మాట్లాడుతూ బంగారు రాజుకి టికెట్ కేటాయించకపోతే రాజీనామా చేస్తానని అన్నారు. సమా వేశంలో చివరిగా 20 పంచాయితీ నాయకులు కార్యకర్తలు బంగార్రాజుకి టికెట్ కేటాయించకపోతే భవిష్యత్తు కార్యాచరణ అతి తొందరలో తెలియజేయడం జరుగుతుంది. పై కార్యక్రమంలో జిల్లా పంచాయితీ అధ్యక్షులు స్వామి, పార్లమెంట్ బ్రాహ్మణ సాధికార కమిటీ కన్వీనర్ రాకేష్ శర్మ, పిల్లా లక్ష్మీనారాయణ,దువ్వు అప్పలస్వామి, సూర్యనారాయణ రాజు, జోగులు,అప్పలస్వామి నాయుడు, సర్పంచ్ గొట్టాపు అప్పల స్వామి రవి, సామాదుల వెంకట రమణ,బసవ అచ్చి బాబు,దల్లి గౌతం రెడ్డి, వెంకట రావు, దువ్వు నరసన్న, సర్పంచ్ వెంకటప్పడు,కూర్మి నాయుడు, నమ్మి సూర్యనారాయణ,వాళ్ళే నారువ నాయుడు, హరిబాబు, బచు రమణ, కొర్నాన అప్పన్న మండలంలో ఉన్న వివిధ సర్పంచులు ఎంపీటీసీలు, నాయకులు పాల్గొన్నారు.

గూడులేని పేదలకు 721 ఇళ్ల పట్టాలు పంపిణీ

విశాలాంధ్ర-రామభద్రపురం: ఇల్లు లేని నిరుపేదలకు జగన్మోహన్ రెడ్డి ఇల్లు స్థలాలు ఇచ్చి వారిని ఆదుకోవడం జరిగిందని స్థానిక ఎమ్మెల్యే ఎస్ వెంకట చినప్పలనాయుడు అన్నారు. సోమవారం తాసిల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. మండలం లోని 721 మంది ఇల్లు లేని నిరుపేదలకు ప్రభుత్వం ఇల్లు పట్టాలు మంజూరు చేసిన ఘనత వైకాపా ప్రభుత్వానికి దక్కుతుందని అన్నారు. గతంలో ఏ ప్రభుత్వము కూడా చేయని సాహసం మన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేశారని అన్నారు. అక్కా చెల్లెమ్మల పేరుతో ముఖ్యమంత్రి ఇల్లు పట్టాలు మంజూరు చేయడం చాలా సంతోషంగా ఉందని అన్నారు. అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టిన ఘనత జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందని కొనియాడారు. మరో రెండు నెలల్లో సార్వత్రిక ఎన్నికలు జరగనున్నాయని మరోసారి మన ముఖ్యమంత్రిని ఎన్నుకుంటే రాష్ట్రం సస్యశ్యామలమవుతుందని అన్నారు. ముఖ్యమంత్రి అవ్వాలంటే తనను ఇక్కడ ఎమ్మెల్యేగా మరోసారి ఆదరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి అప్పికొండ సరస్వతి, వైకాపా మండల పార్టీ అధ్యక్షులు లక్ష్మీ నాయుడు, బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ రాయల పంతులు, వైస్ ఎంపీపీ బెల్లన ప్రసాదు, మండల యువత అధ్యక్షులు ఏకనాథ్ తాసిల్దార్ సులోచన రాణి, ఎంపీడీవో ఈశ్వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లాలో నాలుగు రైల్వే ప్రాజెక్టులకు శంకుస్థాపన

విశాలాంధ్ర-విజయనగరం టౌన్ : జిల్లాలో మూడు రైల్వేస్టేషన్ల పునరాభివృద్ధి చేస్తూ అమృతభారత్ స్టేషన్లుగా రూపొందించడం, నగరంలోని బి.సి.కాలనీ ప్రాంతంలో రైల్వే ట్రాక్ పై నిర్మించనున్న పైవంతెన నిర్మాణ పనులకు భారత ప్రధానమంత్రి నరేంద్రమోది సోమవారం వర్చ్యువల్‌గా శంకుస్థాపన చేశారు. నగరంలోని బి.సి.కాలనీ ప్రాంతంలోని మ్యాంగో యార్డు నుంచి రైల్వే ట్రాక్ దాటేందుకు వీలుగా రూ.48.98 కోట్లతో రైల్వేశాఖ నిర్మించనున్న వంతెన పనులకు, కొత్తవలసలో రూ.18.77 కోట్లు, చీపురుపల్లిలో రూ.21 కోట్లతో, బొబ్బిలిలో రూ.16 కోట్లతో అమృతభారత్ స్టేషన్లుగా అభివృద్ధి చేసే పనులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. దేశవ్యాప్తంగా రూ.41 వేల కోట్లతో 553 రైల్వేస్టేషన్‌లను అమృతభారత్ స్టేషన్‌లుగా పునరాభివృద్ధి చేసే పనులకు, 1500 రైల్వే పైవంతెనలు, అండర్‌పాస్‌ల నిర్మాణానికి చేసిన శంకుస్థాపనల్లో భాగంగా జిల్లాలో చేపట్టే రైల్వే ప్రాజెక్టులకు ప్రధానమంత్రి శంకుస్థాపన చేశారు. నగరంలోని మ్యాంగో యార్డు వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర కార్పొరేటర్లు చందక శ్రీను, బి.పద్మావతి, వాల్తేరులోని డిప్యూటీ చీఫ్ సిగ్నలింగ్ టెలికాం ఇంజనీర్ సిహెచ్.వి.కారుణ్య, బిజెపి జాతీయ కౌన్సిల్ సభ్యులు శివప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.కార్యక్రమంలో విటి అగ్రహారం జెడ్పీ హైస్కూల్ ప్రధానోపాధ్యాయులు ఎస్.ఎస్.వి.టి.రాజేశ్వరరావు, రైల్వే అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా విటి అగ్రహారం హైస్కూలులో విద్యార్ధులకు నిర్వహించిన పోటీల విజేతలకు అతిథుల చేతుల మీదుగా బహుమతులు అందజేశారు.

నేడు డయల్ యువర్ ఆర్టీసీ డీఎం

విశాలాంధ్ర-శృంగవరపుకోట: నేడు అనగా మంగళవారం సాయంత్రం 04.00 గంటల నుండి 05.00 గంటల వరకు డయల్ యువర్ డిపో మేనేజర్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆర్టీసీ డిపో మేనేజర్ కె.రమేష్ సోమవారం తెలియచేశారు. శృంగవరపుకోట డిపో పరిసర ప్రయాణికులు ఈ అవకాశాన్ని వినియోగించు కోవలసినదిగా కోరారు. సంప్రదించవలసిన వారు డిపో మేనేజర్, రమేష్: 9959225619, సూపరింటెండెంట్ 7382923679 నంబర్లకు ఫోన్ చేయవచ్చని డీఎం రమేష్ తెలిపారు.

చీపురుపల్లిలో అభివృద్ధి పనులకు పర్చువల్ పద్ధతిలో శంకుస్థాపన

విశాలాంధ్ర-చీపురుపల్లి : భారతదేశంలో 554 రైల్వేస్టేషన్‌లలో అమృతభారత్ స్టేషన్ పథకంలో భాగంగా విజయనగరం జిల్లా చీపురుపల్లి లో రూ.21 కోట్లతో పురోభివృద్ధికి జరుగు పనులకు దేశ ప్రధాని నరేంద్రమోడి పర్చువల్ (వీడియో కాన్ఫరెన్సింగ్ మాధ్యమం) ద్వారా సోమవారం శంకుస్థాపన చేసారు. కార్యక్రమంలో విజయనగరం జిల్లా వైఎస్సార్సీపీ యువజన విభాగం ఉపాధ్యక్షులు బెల్లాన వంశీ కృష్ణ పాల్గొన్నారు. కార్యక్రమంలో ముందుగా జరిగిన స్కూల్ విద్యార్థుల కల్చరల్ ప్రోగ్రామ్లో విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో జిల్లా బీజేపీ అధ్యక్షులు ఈశ్వర రావు మండల బీజేపీ నాయకులు, వైఎస్సార్సీపీ పట్టణ ఎంపీటీసీలు, వార్డు మెంబర్లు, వైసీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, రైల్వే అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

విదుల పట్ల బాధ్యతగా వ్యవహరించండి

వలంటీర్లు, సచివాలయ సిబ్బందికి ఎంపిడివో సూచన

విశాలాంధ్ర-జామి: ప్రతీ ఒక్కరు తమ విదుల పట్ల అంకితభావంతో పనిచేయాలని, ఉద్యోగ బాధ్యతలను సక్రమంగా నిర్వహించాలని ఎంపిడివో వి. తిరుమలరావు తెలిపారు. సోమవారం స్థానిక కార్యాలయంలో జామి సచివాలయాల సిబ్బంది, వలంటీర్లుతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈసందర్బంగా పలు అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ సిబ్బంది సమయానికి విదులకు హాజరు కావాలని, యూనిఫాం ధరించాలని సూచించారు. ప్రజలకు ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను అందించడంలో వలంటీర్లదే కీలకపాత్ర అని తెలిపారు. ప్రతీ అర్హులైన వారి వివరాలను ఆయా పథకాలకు ఎప్పటికప్పుడు అప్‌లోడ్ చేయాలని సూచించారు. మీ పరిదిలో కొత్త వ్యక్తులు నివాసముంటే వారి వివరాలను తెలుసుకోవాలన్నారు. పథకాలను ప్రజలకు అందించి ప్రభుత్వానికి మంచి పేరు తేవాలన్నారు. ఈసమావేశంలో ఇవోపిఆర్డి శ్రీదేవి తదితరులు పాల్గొన్నారు.

జిపిడిపి ను అప్ లోడ్ చేయించిన ఎంపిడిఓ, ఈఓపిఆర్డీలు

విశాలాంధ్ర-సీతానగరం: మండలంలోని 21గ్రామసచివాలయంల పరిదిలో ఉన్న 35గ్రామ పంచాయతీల గ్రామ పంచాయితీల అభివృద్ధి ప్రణాళికను ఈ-గ్రామ స్వరాజ్ పోర్టల్ లో నమోదు కార్యక్రమాన్ని సోమవారం ఎంపిడిఓ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ సిబ్బంది, డేటా ఎంట్రీ ఆపరేటర్ దేవిలు చేశారు. ఎంపిడిఓ ఎం ఈశ్వరరావు, ఈఓపిఆర్డీ కుమార్ వర్మ దగ్గరుండి నమోదు కార్యక్రమాన్ని పర్యవేక్షణ చేస్తూ 25పంచాయతీలో పూర్తి చేసినట్టు తెలిపారు.నేడు అమరావతిలో దీనిపై జిల్లా పరిషత్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్, జిల్లా పంచాయతీ అధికారితో కమిషనర్ సమీక్ష సమావేశం ఉన్నందున త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు.దీంతోపాటు జగనన్న లబ్ధిదారులకు ఇచ్చిన ఇళ్ళస్థలాల రిజిస్ట్రేషన్, లక్ష్యాల మేరకు ఇంటిపన్నులు వసూలు కూడా పూర్తి చేయాలని కోరారు.15వ ఆర్థిక సంఘం నిధులు సకాలంలో వినియోగించాలని కోరారు.

మళ్లీ జగన్మోహన్ రెడ్డి సిఎం కావాలని అన్నవరంలో పూజలు

విశాలాంధ్ర-నెల్లిమర్ల: వచ్చే ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని అన్నవరం వీరవెంకట సత్యనారాయణ స్వామి సన్నిధిలో నెల్లిమర్ల జెడ్పీటీసీ గదల సన్యాసినాయుడు సోమవారం పూజలు నిర్వహించారు. వచ్చే సార్వత్రిక ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని, అలాగే బడ్డుకొండ అప్పలనాయుడు మళ్లీ ఎమ్మెల్యే కావాలని దేవుణ్ణి ప్రార్థించినట్లు చెప్పారు. స్వామిని దర్శించికున్నవారిలో వైస్ ఎంపీపీలు పతివాడ సత్యనారాయణ, సారిక వైకుంఠం ఉన్నారు.

ఘనంగా రాజరాజేశ్వరి అమ్మవారి వార్షికోత్సవం

విశాలాంధ్ర-నెల్లిమర్ల రూరల్: నెల్లిమర్ల మండలం దేవుని నెలివాడలో కొలువుదీరిన రాజరాజేశ్వరి అమ్మవారి వార్షికోత్సవ వేడుకలు సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా రాజరాజేశ్వరి అమ్మవారికి నెల్లిమర్ల నియోజకవర్గ జనసేన-టిడిపి ఉమ్మడి అభ్యర్థి లోకం మాధవి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు హాజరై అమ్మవారికి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అక్కడికి హాజరైన భక్తులు లోకం మాధవికి శుభాకాంక్షలు తెలియజేశారు.

పోలీస్‌స్టేషన్ కు చేరిన ఇంటర్ ప్రశ్నాపత్రాలు

విశాలాంధ్ర-సీతానగరం: మార్చి 1నుండి ప్రారంభంకానున్న ఇంటర్ పరీక్షలకు ఒక సెట్ ప్రశ్నాపత్రం సోమవారం స్థానిక పోలీస్ స్టేషన్ కు పోలీస్ సెక్యూరిటీ మధ్యలో జిల్లా పరీక్షల కమిటీ సభ్యులు తీసుకొని వచ్చారు. వాటిని స్థానిక పోలీస్ స్టేషన్లో భద్రపరిచారు. మిగిలిన రెండు ప్రశ్నా పత్రాలుకూడా మంగళవారం వస్తాయని బోర్డు అధికారులు తెలిపారు.మండలంలోని సీతానగరం ప్రభుత్వ జూనియర్ కళాశాల, జోగమ్మపేట ప్రతిభా కళాశాల పరీక్షా కేంద్రాలుగా బోర్డు ఏర్పాటు చేసింది. ఆయాకళాశాలల ప్రిన్సిపాళ్ళు వెంకట నాయుడు, త్రినాథ్ లు చీఫ్ సూపరింటెండెంటులుగాను, డిపార్టు మెంట్ అధికారులుగా పార్వతీపురం జూనియర్ లెక్చరర్లు సుకన్య, ధనలక్ష్మిలను బోర్డు అధికారులు నియమించారు.

స్పందన పిర్యాదులు త్వరితగతిన పరిష్కారం చేయాలి : ఎస్పీ విక్రాంత్ పాటిల్

విశాలాంధ్ర-పార్వతీపురం: స్పందన ఫిర్యాదులను తక్షణమే విచారణ జరిపి త్వరితగతిన పరిష్కారం చేయాలని జిల్లా ఎస్పీ విక్రాంత్ పాటిల్ తెలిపారు. ఆరుగురు విచ్చేసి ఫిర్యాదులను అందజేసినట్లు తెలిపారు. ఈస్పందన కార్యక్రమంలో ఎస్పీతోపాటు అదనపు ఎస్పీ(అడ్మిన్) డాక్టరు దిలీప్ కిరణ్,ఎస్బి సిఐ సిహెచ్. లక్ష్మణరావు, డి.సి.ఆర్.బి సిఐ సిహెచ్.వాసునాయుడు పాల్గొన్నారు.

అబివృద్ధిని చూసి ఓటు వెయ్యాలి : మంత్రి బొత్స

అభివృద్ధిని చూసి ఓటు వేయాలని విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ పిలుపునిచ్చారు. సోమవారం మధ్యాహ్నం చీపురుపల్లి మాజీ జెడ్పిటిసి సభ్యులు మీసాల వరహాలనాయుడు 500 కుటుంబాల వారు వైకాపా పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వరహాలనాయుడు అతని సతీమణి సరోజినితో పాటు పలువుర్ని మంత్రి బొత్స పార్టీ కండువాతో పార్టీలో ఆహ్వానించారు. కార్యక్రమంలో జెడ్పీ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, ఎంపి బెల్లాన చంద్రశేఖరరావు, తదితరులు పాల్గొన్నారు.

ఆధార్ ఆపరేటర్లకు శిక్షణ కార్యక్రమం

విశాలాంధ్ర - విజయనగరం : జిల్లాలో ఆధార్ సేవలు అందించడంలో వచ్చే సాంకేతిక సమస్యలు, సందేహాల పరిష్కారంపై గ్రామ, వార్డు సచివాలయాల్లోని ఆపరేటర్లకు ఒక రోజు శిక్షణ కార్యక్రమం జిల్లాపరిషత్ సమావేశ మందిరంలో సోమవారం గ్రామ వార్డు సచివాలయాల శాఖ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఆ విభాగం జిల్లా సమన్వయకర్త జి.ఎస్.నిర్మలాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన శిక్షణ కార్యక్రమంలో ఆధార్ సేవలు అందించడంలో పాటించాల్సిన కొత్త మెళకువలను గురించి ఆధార్ కేంద్ర కార్యాలయం నుంచి వచ్చిన బాలప్రసాద్, గ్రామవార్డు సచివాలయ శాఖకు చెందిన వి.వి.ఎస్.సుందరం తదితరులు ఆపరేటర్లకు తెలియజేశారు. జిల్లాలో 125 గ్రామ వార్డు సచివాలయాల ద్వారా ఆధార్ సేవలు అందిస్తున్నామని, ప్రజలకు మరింత ఖచ్చితమైన, మెరుగైన సేవలు అందించాలనే లక్ష్యంతో ఆపరేటర్లకు శిక్షణ ఇస్తున్నట్టు జిల్లా సమన్వయ అధికారి నిర్మలాదేవి చెప్పారు.

అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు మంజూరు : డిప్యూటీ సీఎం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్ల పట్టాలు మంజూరు చేయడమే కాకుండా వాటికి పూర్తి హక్కు పత్రాలను కూడా అందించడమే ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ధ్యేయమని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పునరుద్ఘాటించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో పలువురు లబ్ధిదారులకు ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్ పత్రాలను అందజేశారు. నగర పరిధిలో ఉన్న లబ్ధిదారులకు ఇప్పటికే గుంకులాం, జమ్ము, కొండకరకాం, సారిక, ప్రాంతాలలో మొత్తం 19,601 మందికి ఇళ్ల పట్టాలను మంజూరు చేయడం జరిగింది. వాటిలో ఇప్పటివరకు 12,009 మంది లబ్ధిదారుల పట్టాలకు రిజిస్ట్రేషన్ ప్రక్రియ కూడా పూర్తి అయింది. సదరు రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్లను ఈరోజు లబ్ధిదారులకు అందించడంతో మహిళల్లో ఆనందం వ్యక్తం అయింది. ఈ సందర్భంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి నవరత్నాలు రూపంలో పేదలందరికీ ఇళ్ల పథకాన్ని ప్రతిష్టాత్మకంగా నిర్వహించి అమలు చేశారని అన్నారు. అంతేకాకుండా ఆయా స్థలాలకు పూర్తి హక్కులను కూడా కల్పిస్తూ రిజిస్ట్రేషన్ చేసి అందజేయడం సరికొత్త విధానమని అన్నారు. ఇప్పటివరకు ఏ ప్రభుత్వం ఇటువంటి ప్రక్రియ చేపట్టలేదని తెలిపారు. గతంలో పేదలకు తాము ఇచ్చిన ఇళ్ల పట్టాలను రద్దు చేస్తూ వేరొకరికి ఇల్లును గత ప్రభుత్వం మంజూరు చేసే ప్రక్రియ కొనసాగిందని, అటువంటివి పునరావృతం కాకుండా పూర్తి హక్కులతో ఇళ్ల స్థలాలను అందించడం వల్ల లబ్ధిదారులకు ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. ఆయా స్థలాలు అన్యాక్రాంతం కాకుండా ఎప్పటికీ పూర్తి హక్కుదారులుగా కలిగి ఉంటారని అన్నారు. ఈ రిజిస్ట్రేషన్ ప్రక్రియకు 8,668 రూపాయలు ఖర్చు కాగా లబ్ధిదారుల నుంచి ఒక్క రూపాయి కూడా వసూలు చేయకుండా ప్రక్రియను పూర్తి చేసిన ఘనత తమ ప్రభుత్వాని దేనని అన్నారు. దేశంలోని లంచగొండితనం లేని పాలన ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలో రాష్ట్రంలో సాగుతోందని చెప్పారు. అన్ని ప్రభుత్వ పథకాలను మహిళల పేరిటనే అందిస్తూ మహిళా పక్షపాతిగా వైఎస్ జగన్మోహన్ రెడ్డి కొనియాడబడుతున్నారని అన్నారు. అందరూ మరల ఆయనకు బాసటగా నిలిచి మద్దతునిచ్చి మరోసారి వైసీపీ ప్రభుత్వాన్ని గద్దినెక్కించాలని కోరారు. నగర మేయర్ విజయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సంక్షేమ పాలన అందిస్తుంటే, స్థానికంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నగర అభివృద్ధికి కృషి చేశారన్నారు. దీని ఫలితంగానే నగరం అన్ని రంగాలలో అభివృద్ధి చెందిందన్నారు. ఎటు చూసినా సరికొత్త అందాలు సంతరించు కుంటున్నాయని చెప్పారు. మరలా శాసన సభ్యునిగా గెలిపించినట్లయితే సమస్యలు లేని నగరంగా తీర్చిదిద్దుతారనడంలో అతిశయోక్తి లేదన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ముచ్చు లయా యాదవ్, కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు,సహాయ కమిషనర్ తిరుమలరావు, వైసిపి నగర అధ్యక్షుడు ఆశపు వేణు, హౌసింగ్ కమిటీ సభ్యులు కంటుభుక్త తవిటి రాజు, మారోజు శ్రీనివాసరావు, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు పాల్గొన్నారు.

త్వరితగతిన అర్జీలు పరిష్కారం చేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : జగనన్నకు చెబుదాం కార్యక్రమం ద్వారా ప్రజలు తెలియజేసిన సమస్యలకు అధికారులు పూర్తి స్థాయిలో పరిష్కారం చూపాలని ఇంచార్జి జాయింటు కలెక్టరు సి.విష్ణు చరణ్ జిల్లా అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో ఇంచార్జ్ జాయింట్ కలెక్టర్ సి.విష్ణు చరణ్, ఇంచార్జి జిల్లా రెవెన్యూ అధికారి జి.కేశవనాయుడు, రెవెన్యూ డివిజనల్ అధికారి కె.హేమలతలతో కలిసి ప్రజల నుండి వినతులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో పలుసామాజిక, వ్యక్తిగత అంశాలపై 140 అర్జీలను అందజేశారని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్యఆరోగ్య అధికారి బి. జగన్నాథం, జిల్లా గ్రామపంచాయతీ అధికారి బలివాడ సత్యనారాయణ, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకరరావు, జిల్లా బిసి సంక్షేమ సాధికారిత అధికారి ఎస్.కృష్ణ, జిల్లా శిశు సంక్షేమ శాఖ అధికారి ఎం ఎన్. రాణి, జిల్లా ఆర్.డబ్ల్యు.ఎస్ ఇంజినీరింగ్ అధికారి ఓ. ప్రభాకర రావు, బి. సి వెల్ఫేర్ అధికారి ఎస్. కృష్ణ, జిల్లా నీటి యాజమాన్య సంస్థ పి. డి. రామచంద్రరావు తదితర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

జగనన్నకు చెపుదాంకు 175 వినతులు

విశాలాంధ్ర - విజయనగరం : జగనన్నకు చెబుదాంలో వివిధ సమస్యలపై ప్రభుత్వ శాఖలకు ప్రజల నుంచి అందిన వినతుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించి వాటిని సకాలంలో పరిష్కరించాలని డి.ఆర్.ఓ అనిత ఆదేశించారు. ఆయా ప్రభుత్వ శాఖలు తమకు సంబంధించి ఆన్‌లైన్‌లో పంపిన వినతులను పరిశీలించి వాటిపై స్పందించా లన్నారు. . రెవిన్యూ శాఖ సమస్యలపై 129 , డి.ఆర్.డి.ఏ. కు సంబంధించి 04 , గ్రామ వార్డు సచివాలయాల శాఖకు 15 , జిల్లా పంచాయతీ శాఖ కు 12 , గృహనిర్మాణ శాఖకు 07, జిల్లా ఆసుపత్రులకు సంబంధించి 03, ఏ.పి.విద్యుత్ పంపిణీ సంస్థకు సంబంధించి 01 వినతులు, మున్సిపల్ శాఖకు 04 చొప్పున వినతులు అందాయి.

ఐటిడిఎ పిఓకు గిరిజన విద్యార్థి సంఘం నాయకులు వినతిపత్రం

విశాలాంధ్ర - బెలగాం : గిరిజన విద్యార్థుల సమస్యలు పరిష్కారం చేయాలని కోరుతూ పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరేట్ స్పందన కార్యక్రమంలో సోమవారం గిరిజన విద్యార్థి సంఘం అధ్యక్షులు పల్ల సురేష్, నాయకులు సిహెచ్ సీతారాం, జట్ల బంగారురాజు తదితరుల ఆధ్వర్యంలో పార్వతీపురం ఐటిడిఎ పిఓకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల మృతి చెందిన పలువురు గిరిజన విద్యార్థుల కుటుంబాలకు ప్రభుత్వం నష్టం పరిహారం చెల్లించాలని, ప్రతీ ఆశ్రమ పాఠశాలల్లో ఆదివాసీ ఆరోగ్య సిబ్బందిని నియమించాలని, గిరిజన నిరుద్యోగులకు ప్రత్యేక డిఎస్సీ చేయాలని, వసతి గృహాలకు పెండింగ్ లో ఉన్న డైట్ బిల్లులు విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఎర్రసామంతవలస, సరాయివలస గిరిజన ఆశ్రమ పాఠశాల డిప్యూటీ వార్డెన్లు సస్పెన్షన్ ఎత్తి వేయాలని కోరారు.

కేప నాయుడుకి అసెంబ్లీ టికెట్ ఇస్తే భారీ మెజారిటీ ఇప్పిస్తాం

విశాలాంధ్ర - దత్తిరాజేరు : పెదకాద గ్రామంలో సోమవారం మండల తెలుగుదేశం పార్టీ క్రియాశీలక కార్యకర్తల సమావేశం మండల టిడిపి నాయకులు పెద్దింటి మోహన్ ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సమావేశంలో 35 పంచాయితీల నుండి దశాబ్దాలుగా పార్టీ కోసం పని చేస్తున్న క్రియాశీలక కార్యకర్తలు పాల్గొ న్నారు. మాజీ ఎమ్మెల్యే 2014 నుండి 2019 వరకు మండలాన్ని అన్ని రకాలుగా అబివృద్ధి చేశారని, 2019లో అధికారం కోల్పోయినా కార్యకర్తలకు అండగా ఉన్నారని అన్నారు..పార్టీ నిర్దేశించిన అన్నీ కార్యక్రమాలు విజయవంతంగా చేశామని, ఎన్నికలకు సిద్ధమైన వేళలో ఇలాంటి మార్పులు ఇబ్బందికరంగాఉన్నాయని అన్నారు. ప్రజారాజ్యం, వైఎస్సార్సీపీ పార్టీలు మారి, బొత్స అనుచరులుగా ఉంటూ మండలంలో కార్యకర్తలను ఇబ్బంది పెట్టినవారికి టికెట్ ఇవ్వడం బాధాకరమని, మరోసారి సర్వే జరిపించి డా.కే.ఏ.నాయుడుకి గజపతినగరం నియోజకవర్గం అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలని తీర్మానం చేసి రాష్ట్ర పార్టీకి పంపిస్తున్నామని అన్నారు. అభ్యర్థిగా కే.ఏ.నాయుడు కి అవకాశం కల్పిస్తే భారీ మెజారిటీ తో గెలిపించుకుంటామని అన్నారు.

బాబు షూరిటీ భవిష్యత్తు గ్యారంటీ కార్యక్రమానికి అనూహ్య స్పందన



విశాలాంధ్ర - పాచిపెంట : మండలంలో గల గిరిజన గ్రామాలైన మెలియా కంచూరు తమ్మరవల్లి గిరిజన గ్రామాలలో మాజీ ఎమ్మెల్సీ గుమ్మడి సంధ్యారాణి సోమవారం నిర్వహించిన కార్యక్రమానికి స్పందన లభించింది. మండల పార్టీ అధ్యక్షులు పిన్నింటి ప్రసాద్ బాబు ఆధ్వర్యంలో పలువురు గిరిజనులు పార్టీ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా నియోజకవర్గ ఇన్చార్జి గుమ్మడి సంధ్యారాణికి గిరిజనులు నుండి అపూర్వ స్వాగతం లభించింది .ఈ సందర్భంగా గిరిజన ఉద్దేశించి సంధ్యారాణి మాట్లాడుతూ గిరిజనులకు ప్రభుత్వ పథకాల అందాలంటే మళ్ళీ చంద్రబాబు నాయుడు ని ముఖ్యమంత్రిగా చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఆమె అన్నారు. ఈ ఐదేళ్లలో జగన్ ప్రభుత్వం గిరిజనులకు ఏమి చేయలేదని అన్నారు ప్రభుత్వ పథకాలు గిరిజనులకు అందని ఎండమావిగా మిగిలాయని ఆమె వేరు చేయబడ్డారు ప్రతి పేద వాడిని లక్షాధికారిగా చేయాలంటే చంద్రబాబును ముఖ్యమంత్రిని చేయాల్సిన బాధ్యత ఎంతైనా ఉందని సంధ్యారాణి అన్నారు గిరిజలలంతా ఈసారి చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి చేయాలని ఈ కార్యక్రమంలో మండల టిడిపి నాయకులు కొత్తలపాడు నాయుడు ముఖ్య సూర్యనారాయణ సత్యనారాయణ ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

పార్క్ పనులను పరిశీలించిన డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : నగరంలోని 17వ డివిజన్‌లో నూతనంగా ఏర్పాటు చేస్తున్న చిల్డ్రన్స్ పార్క్ పనులను డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి పరిశీలించారు. సోమవారం పార్కులో చేపడుతున్న పనులు ప్రగతిని సమీక్షించారు. పార్కులో ఏర్పాటు చేసిన పిల్లల వ్యాయామ పరికరాలు,క్రీడా సామగ్రి, సుందరీకరణకు చేపడుతున్న అంశాలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. మరింత ఆకర్షణగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సూచనలు సలహాలను అందించారు. ఈ సందర్భంగా వైసీపీ నగర అధ్యక్షుడు ఆశపు వేణు మాట్లాడుతూ మాట్లాడుతూ నగరంలో ఇప్పటికే అనేక పార్కులను తీర్చిదిద్దడం జరిగిందన్నారు. డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి నేతృత్వంలో పార్కులకు మహర్దశ పట్టినట్టు అయిందని అన్నారు. రాష్ట్రంలోనే తొలి మహిళా పార్కును ఏర్పాటు చేయడం సంతోషదాయకమన్నారు. ప్రస్తుతం పిల్లల కోసం ప్రత్యేకించి పార్కుతో పాటు వ్యాయామ పరికరాలను కూడా ఏర్పాటు చేసి పిల్లలకు అంకితమిచ్చేందుకు కృషి చేస్తున్నామన్నారు. నగర అభివృద్ధే ధ్యేయంగా డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్ర స్వామి చేస్తున్న కృషిని పలువురు ప్రశంసిస్తున్నారని చెప్పారు. నగరపాలక సంస్థ ఇంచార్జ్ ఈఈ దక్షిణామూర్తి మాట్లాడుతూ సుమారు కోటి రూపాయలతో నగరంలో చిల్డ్రన్స్ పార్క్ ను ఏర్పాటుకు అవసరమైన అన్ని చర్యలు చేపడుతున్నామన్నారు. పిల్లలకు ఆహ్లాదకర వాతావరణంలో తీర్చిదిద్దుతున్నామన్నారు. క్రీడ పరికరాలు పిల్లలకు ఆకర్షితులను చేసే విధంగా రూపుదిద్దుకుంటుందన్నారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ ఎం.మల్లయ్య నాయుడు, కబడ్డీ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి కాళ్ళ సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో గ్రామంలో ములక్కా వలస గ్రామంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల నిర్వహించిన ఎన్ఎస్ఎస్ ప్రత్యేక శిబిరం భాగంగా కరోనా అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు మాస్కులు పంపిణీ చేశారు కరోనా వల్ల ఎన్ని నష్టాలు ప్రజలందరికీ తెలియపరిచారు కరోనా జాగ్రత్తలు పరిశుభ్రంగా ఉంచాలి కాళ్ళ చేతులు కడుక్కోవాలి వేడి నీళ్ల తాగాలి ప్రోటీన్ ఫుడ్ తినాలి అనేక విషయాలు ప్రజలకు అవగాహన కల్పించారు ఎన్ఎస్ఎస్ క్యాంపు ద్వారా వాలంటరీ ద్వారా మాస్కులు పంపిణీ చేశారు కరోను పైన నినాదాలు చేసి భారీ ర్యాలీలు నిర్వహించి ప్రజలకు అవగాహన కల్పించారు గ్రామ ప్రజలు సమావేశంలో కళాశాల ప్రిన్సిపల్ మంజుల వీణ ఎన్ఎస్ఎస్ పిఓ ఎం శ్రీనివాసరావు కే బాబ్జి జువాలజీ వై కిషోర్ కుమార్ తెలుగు మాస్టర్ విద్యార్థులు ఎన్ఎస్ఎస్ వాలంటరీలు పాల్గొన్నారు.

డాక్టర్ పట్టా పొందిన దళిత విద్యార్థి రాహుల్

విశాలాంధ్ర - వేపాడ : మండలం లోని వావిల పాడు గ్రామానికి చెందిన తోత్తడి గోండయ్య కు మారుడు తోత్తడి రాహుల్ డాక్టర్ పట్టా పొంద డంపై గ్రామస్తులు, మండల దళిత నాయకులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.దళిత కుటుంబానికి చెందిన రాహుల్ నెల్లిమర్ల మెడికల్ కళాశాల విమ్స్ లో ఎంబిబిఎస్ పూర్తి చేసి డాక్టర్ పట్టా పొందాడు. నిరుపేద కుటుంబానికి చెందిన రాహుల్ మెడిసిన్ పూర్తి చేయడంపై ఆనందం వ్యక్తం చేయడంతో పాటు అభినందిస్తున్నారు.

ఉపాధి హామీ పథకం లక్ష్యాలు నెరవేర్చాలి

విశాలాంధ్ర - సీతానగరం : నియోజక వర్గంలోని సీతానగరం, పార్వతీ పురం, బలిజిపేట మండలాల్లో ఉపాధి హామీ పథకం ద్వారా నిర్దేశించిన లక్ష్యాలను సాధించడానికి సిబ్బంది కృషి చేయాలని ఉపాధి హామీ పథకం జిల్లా పథక సంచాలకులు కె. రామచంద్రరావు పిలుపునిచ్చారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మూడు మండలాల సహాయ ప్రోగ్రాం అధికారులు, ఇంజనీరింగ్ అధికారులు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, కార్యాలయ సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. శతశాతం వేతనదారులు పనులకు రెండు పూటల హాజరయ్యేల చర్యలు తీసుకోవాలని, అక్రమ మస్టర్లు నిరోధించాలని కోరారు. వేతనదారుల నుండి డబ్బులు వసూలు చేస్తున్నట్లు పిర్యాదులు వస్తే వేటు తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిడిఓ ఎం ఈశ్వరరావు, ఏపిఓలు భాను, నాగలక్ష్మి, కేశవరావు తదితరులు పాల్గొన్నారు.

బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బొచ్చ బుద్ధుడు మాస్టర్

విశాలాంధ్ర - రాజాం : విజయనగరం జిల్లా రాజా నియోజకవర్గ బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బొచ్చ బుద్ధుడు మాస్టారును జాతీయ అధ్యక్షురాలు కుమారి బెహన్ మాయావతి ఆదేశాల మేరకు, సోమవారం ఆంధ్రప్రదేశ్ బీఎస్పీ విజయవాడ కార్యాలయంలో పార్టీ అధ్యక్షుడు బి.పరంజ్యోతి, రాజాం నియోజకవర్గం బహుజన సమాజ్ పార్టీ అభ్యర్థిగా బొచ్చ బుద్ధుడు మాస్టారును ప్రకటించినట్లు మీడియాకు తెలిపారు, అయితే పార్టీ కార్యకర్తలు మరియు అభిమానులు బుద్ధుడు మాస్టారుకు టికెట్ ఇవ్వడంతో హర్షం వ్యక్తం చేశారు. అయితే బుద్ధుడు మాస్టర్ మాట్లాడుతూ నా సేవలను గుర్తించి నన్ను రాజాం నియోజకవర్గ అభ్య ర్థిగా ఎంపిక చేసిన జాతీయ అధ్యక్షురాలు మాయావతికి రాష్ట్ర అధ్యక్షులు పరంజ్యోతికి కృతజ్ఞతలు తెలియజేశారు.

ఈనెల 29లోగా లైఫ్ సర్టిఫికెట్‌లను అందజేయాలి

విశాలాంధ్ర - పార్వతీపురం : పింఛనర్లు తమ లైఫ్ సర్టిఫికేట్లను ఈనెల 29లోగా సమర్పించాలని జిల్లా ఖజానా అధికారి ఏ.మన్మథరావు తెలిపారు. సోమవారం ఒక ప్రకటనను విడుదల చేశారు. ఇంకా కొంత మంది పింఛనర్లు తమ లైఫ్ సర్టిఫికేట్ లను సమర్పించ లేదని ఆయన పేర్కొన్నారు. లైఫ్ సర్టిఫికేట్ లను సమర్పించని పింఛనర్లు అందరూ 29లోగా ఆన్ లైన్ లో సమర్పించాలని ఆయన సూచించారు. అన్ని ఖజానా కార్యాలయాల్లో హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసి సేవలు అందించడం జరుగుతుందని ఆయన చెప్పారు. కదలలేని స్థితిలో ఉన్న వారి వివరాలు ఖజానా కార్యాలయాల్లో తెలియజేయాలని, వారి లైఫ్ సర్టిఫికేట్ లు ఆన్ లైన్ చేయుటకు ఖజానా అధికారులు సహకరిస్తారని ఆయన అన్నారు. సకాలంలో లైఫ్ సర్టిఫికేట్ అందజేసి సహకరించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

ఉపాధి కూలీలకు బకాయిల చెల్లించాలి

విశాలాంధ్ర - మక్కువ : మన్యం జిల్లా మక్కువ మండలంలో ఉపాధి కూలీలకు బకాయిల చెల్లించాలని మక్కువ ఆఫీస్ వద్ద ధర్నా కార్యక్రమం జరిగింది ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి కొల్లి గంగు నాయుడు మాట్లాడుతూ ఉపాధి కూలీలు గత ఐదు వారాలుగా పనిచేస్తున్నప్పటికీ బిల్లులు చెల్లించలేదని కూలీలు బిల్లుల రాకపోవడం వలన ఆర్థిక ఇబ్బందులకు గురవుతున్నారని అన్నారు ఇప్పటికే ఉపాధి పనులు సక్రమంగా జరగకపోవడం వలన కూలీలు వలసలు వెళ్లిపోతున్నారని పనిచేసిన వారికి కూలి రాకపోవడంతో వీళ్ళు కూడా వలసలు వెళ్లిపోవడానికి సిద్ధపడుతున్నారని వెంటనే జిల్లా పిడి గారు స్పందించి గత 5 వారాల నుండి పనిచేస్తున్న కూలీలందరికీ మన్యం జిల్లాలో బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు అలాగే రెండు పూటలా పని రద్దు చేయాలని ఎంఎంఎస్ యాప్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు బిజెపి అధికారంలోకి వచ్చిన తర్వాత ఉపాదా మీ పథకాన్ని ఎత్తివేయడానికి ప్రయత్నం చేస్తున్నదని అందులో భాగంగానే కూలీలకు ఇబ్బందులు గురిచేస్తుందని అన్నారు 2024లో బిజెపి అధికారంలోకొస్తే ఉపాదామిని ఎత్తివేయడం ఖాయమని ఉపాధి కూలీలంతా పోరాడి సాధించుకున్న ఉపాధి పథకాన్ని మరలా పోరాడి నిలబెట్టుకోవాలని కోరారు ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల కార్యదర్శి పిట్టల సీతారాం గిరిజన సంఘం మండల కార్యదర్శి తాడంగి ప్రభాకర్ కూలీలు పాల్గొన్నారు.

డీఎస్సీలో ఆదివాసి నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్రమైన నష్టం

విశాలాంధ్ర - బెలగాం : ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన డిఎస్సీ-2024 నోటిఫికేషన్ ప్రకారం 5వ షెడ్యుల్ ప్రాంతంలో నివసిస్తున్న ఆదివాసి నిరుద్యోగ అభ్యర్థులకు తీవ్రమైన నష్టం జరుగుతుందని పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీ జెఏసి ఛైర్మన్ కె. ధర్మారావు ఆరోపించారు. సోమవారం ఆయన పార్వతీపురం మన్యం జిల్లా ఆదివాసీ జెఏసి నాయకులతో కలసి విలేకరులతో మాట్లాడుతూ డిఎస్సీ-2024 జనరల్ నోటిఫికేషన్ వలన ఉపాధ్యాయ పోస్టులు కేవలం 6,100 మాత్రమే ప్రకటించి కేవలం ఎస్టీలకు 1,025 పోస్టులు మాత్రమే కేటాయించిదని, 5వ షెడ్యుల్ ప్రాంతంలో 500 పోస్టులు భర్తీ చేస్తామని జనరల్ డిఎస్సీ-2024లో పేర్కొన్నారు కానీ రూల్ ఆఫ్ రిజర్వేషన్ అమలు చేయడంలో గిరిజనులకు తీవ్రమైన అన్యాయం జరుగుతుందన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో కేవలం 38 పోస్టులతో సరిపెట్టారు కాని రాజ్యాంగ పరంగా 1/70 చట్టం ప్రకారం స్థిర నివాసమునకు అనుమతి లేని వారికి 2.శాతం వున్న గిరిజనేతరులకు 95% పోస్టులు కేటాయించి, 98% శాతం ఉన్న గిరిజనులకు 5% శాతం కేటాయించడం చాలా దారుణమన్నారు. ఆదివాసీ ప్రాంతంలో నివసించే గిరిజనులకు "ప్రత్యేక డీఎస్సీ -2024" ప్రకటించాలని ఈ ప్రభుత్వానికి డిమాండు చేస్తున్నామని, లేనిచో మా ఆదివాసీ ప్రాంతంలో వున్న వేలాదిమంది గిరిజన నిరుద్యోగ యువతతో పెద్ద ఎత్తున పోరాటానికి సిద్ధమవుతామని హెచ్చరిస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో పార్వతీపురం మన్యం జిల్లా జెఏసి జాయింట్ సెక్రటరీ దుక్క సీతారాం, ఆదివాసీ జెఏసి నాయకులు ఎ.నీలకంఠం (పిఆర్ఓ), పి. అమర్నాథ్, ఐ.రామకృష్ణ, ఎ.చంద్రశేఖర్, ఎల్.లోవరాజు, బి.రామారావు, కె.గౌరమ్మ, ఎం.పారమ్మ, పి. సురేష్, ఎ.అన్నారావు, జై సింహ తదితరులు పాల్గొన్నారు.

ఆధునిక పరిజ్ఞానంతో చిన్నపిల్లలకు గుండె శస్త్ర చికిత్సలు విజయవంతం

విశాలాంధ్ర - విజయనగరం టౌన్ : జిల్లా కేంద్రమైన విజయనగరంలో ఉన్న తిరుమల మెడికవర్ ఆసుపత్రి లో ఆధునిక సాంకేతిక పరిజ్ఞానంతో చిన్నపిల్లలకు గుండె శస్త్ర చికిత్సలను విజయ వంతంగా నిర్వహించామని ఆసుపత్రి మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ కె.తిరుమల ప్రసాద్ తెలిపారు. ఈ మేరకు సోమవారం ఆసుపత్రిలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఇప్పటివరకు ఆసుపత్రిలో పెద్దవారికి మాత్రమే గుండె శస్త్ర చికిత్సలు నిర్వహిస్తున్నామని, ప్రస్తుతం పదేళ్ల లోపు చిన్న పిల్లలకు కూడా ఆధునిక పరిజ్ఞానంతో కుట్టు, కోత లేకుండా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించమని తెలిపారు. కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ రాజు ఆధ్వర్యంలో ఇటీవల జిల్లాలోని మెంటాడ మండలానికి చెందిన సబ్బిశెట్టి శ్రావణి, గరివిడి మండలానికి చెందిన దాక్షాయిని అనే ఇద్దరు బాలికలకు ఆధునిక డివైస్ క్లోజర్ ప్రొసీజర్ ద్వారా విజయవంతంగా గుండె శస్త్ర చికిత్సలను నిర్వహించడం జరిగిందన్నారు. పదేళ్ల లోపు వయసు కలిగిన వీరు శస్త్ర చికిత్స జరిగిన కేవలం రెండు రోజుల్లో కోలుకొని నడవడం జరిగిందన్నారు. సాధారణంగా హార్ట్ సర్జరీ జరిగిన పిమ్మట సంవత్సరం వరకు ఎవరు కోరుకోలేరని, ఇప్పుడు కొత్త విధానం ద్వారా కేవలం రెండు రోజుల్లో మనిషి కోలుకొని నడవడం జరుగుతుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు వినియోగించుకోవాలని ఆరోగ్యశ్రీలో కూడా చిన్న పిల్లల గుండె శస్త్ర చికిత్సల వైద్య సౌకర్యం ఉందన్నారు. ఈ సమావేశంలో కార్డియాలజిస్ట్ డాక్టర్ అశోక్ రాజు, డాక్టర్ మహేశ్వర రావు, ఆసుపత్రి సెంటర్ హెడ్ పద్మ కుమార్, డాక్టర్ పి.ఎస్.వి.రామారావు, కార్డియాలజిస్ట్ డాక్టర్ శరత్ కుమార్ పాత్రో, డాక్టర్ బి.రవి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

రాబోయే ఎన్నికలలో తెలుగుదేశం పార్టీ విజయం తథ్యం

విశాలాంధ్ర - గంట్యాడ : గజపతినగరం నియోజకవర్గంలో గంట్యాడ మండలం జగ్గాపురం, నందామ్, నీలావతి తదితరగ్రామాలలో తెలుగుదేశం పార్టీ కార్యక్రమాలపై చర్చిస్తున్న కొండపల్లి కొండలరావు రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ విజయానికి కృషి చేసి తెలుగుదేశం మరియు జనసేన ఉమ్మడి అభ్యర్థి కొండపల్లి శ్రీనివాసునిగెలిపించుకోవలసిన అవసరం ఎంతైనా ఉందని టిడిపి పార్టీకి చెందిన నాయకులు కార్యకర్తలు అభిమానులు శ్రమిస్తే విజయం తథ్యం అన్నారు. రానున్న ఎన్నికలలో గెలిపే ధ్యేయంగా అలుపెరగని పోరాటం చేయాలని కార్యకర్తల్లో ఉత్సాహాన్ని నింపారు పార్టీ కార్యకర్తలకు సర్వ విధాల అండగా ఉంటానని ఆయా గ్రామాలలో హామీ ఇచ్చారు నియోజకవర్గంలో ఎవరు ఎప్పుడు పిలిచినా వారికి సర్వవిధాల అండగా ఉంటూ తమ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ కొండపల్లి శ్రీధర్, మాజీ సర్పంచ్ కొండపల్లి నూకాలనాయుడు, కొండపల్లి బంగారు నాయుడు. నరవ మాజీ ఎంపీటీసీ సంక్రాన పైడి రాజు, వసాది మాజీ ఎంపీటీసీ జగన్నాథ రావు టిడిపి సీనియర్ నాయకులు సంక్రాన త్రినాథ్, కోరుకొండ చిన్నము నాయుడు పాల్గొన్నారు.

హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్లు తప్పనిసరి

విశాలాంధ్ర - పార్వతీపురం టౌన్ : సుప్రీం కోర్టు అఫ్ ఇండియా సూచనలు అనుసరించి కేంద్ర రవాణా మంత్రిత్వ శాఖ అజ్ఞానుసారం రాష్ట్ర రవాణా శాఖ కమీషనర్ ఆంధ్ర ప్రదేశ్ ఉత్తర్వుల మేరకు అన్ని పాత వాహనములు (హెచ్ఎస్ఆర్పీ) నెంబర్ ప్లేట్ లేని వాహనములు) తేది 01.03.2024 నుండి విధిగా హైసెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ ను అమర్చుకోవలెను. కనుక హై సెక్యూరిటీ సెక్యూరిటీ (హెచ్ఎస్ఆర్పీ) నెంబర్ ప్లేట్ లేని వాహనములు యొక్క యజమానులందరు జిల్లాలో గల మీ వాహనము యొక్కమేన్యూఫ్యాక్చర్ షోరూం (డీలర్) వద్దకు వెళ్లి ఎస్ఐఎఎం పోర్టల్ లో నిర్ణీత రుసుం చెల్లించి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ను బుక్ చేసుకొని తిరిగి 7 రోజులలో మీ యొక్క వాహనమునకు హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ను అమర్చుకోవలెను. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం ప్రతి వాహనమునకుహై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ఉండాలని ఆదేశాలు జారీ చేసింది. కనుక జిల్లా లోని హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ లేని ప్రతి ఒక్క వాహనదారుడు తప్పని సరిగా హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్ ను అమర్చుకోవలెను. లేనిచో జిల్లా పోలీస్ శాఖ మరియు రవాణా శాఖ పార్వతీపురం మన్యం జిల్లాలో విస్తృత తనిఖీలు నిర్వహించి హై సెక్యూరిటీ నెంబర్ ప్లేట్స్ లేని వాహనములకు భారీగా అపరాధరుసుం ను విధించబడును అని తెలియ చేయడమైనదని పార్వతీపురం మన్యం జిల్లా రవాణాశాఖాధికారి తెలిపారు.

'కాంగ్రెస్ పార్టీ న్యాయసాధన సభకు హాజరైన గడి

విశాలాంధ్ర - శృంగవరపుకోట : శృంగవరపుకోట మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గడి బంగారు నాయుడు అనంతపురంలో జరుగుతున్న న్యాయసాధన సభకు సోమవారం హాజరయ్యారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆంధ్రప్రదేశ్ పి.సి.సి అధ్యక్షులు వైఎస్ షర్మిలా రెడ్డి హాజరైన సభకు హాజరు కావాలన్న పిలుపు మేరకు గడి బంగారు నాయుడు తరలివెళ్లారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకులను కలిసి ఎస్ కోట నియోజకవర్గంలో కాంగ్రెస్ పార్టీ బలం, బలహీనతలపై చర్చించామని బంగారు నాయుడు స్పష్టం చేశారు. కాగా ఈ కార్యక్రమానికి విజయనగరం డిసిసి అధ్యక్షులు రమేష్, ఎస్టీ సెల్ ఛైర్మన్ చీమల అచ్చిబాబు, జామి కాంగ్రెస్ మండలపార్టీ అధ్యక్షులు బోని అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదం ఒకరు మృతి

విశాలాంధ్ర - పూసపాటిరేగ : మండలం లో పోలీసు స్టేషన్ ఎదురుగా నిన్న రాత్రి జరిగిన ప్రమాదం లో లావేరు మండలం మండాకురిటికి సంబంధించిన కొప్పిశెట్టి సోమేష్ (,72) తండ్రి సీతయ్య ను.గుర్తు తెలియని వాహనం గుద్దడం వల్ల హాస్పిటల్ కి తీసుకెళ్ల గా అప్పటికే చనిపోయాడు అని డాక్టర్స్ చెప్పారు. పూసపాటి రేగ సబ్ ఇన్స్పెక్టర్ సన్యాసి నాయుడు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పసుమర్తి నరేష్‌కుమార్‌కు గౌరవ డాక్టరేట్ ప్రదానం

విశాలాంధ్ర - సాలూరు టౌన్ : రోగులపట్ల బాధ్యతగా వెలుగుతూ నిరంతరం వారికి వైద్య సేవలను అందిస్తూ ఒక గౌరవాన్ని పొందిన పసుమర్తి నరేష్ కుమార్.సాలూరు పట్టణంలో గ్రామీణ వైద్యులు గా ఉంటూ ఉచిత వైద్యాన్ని, రక్తదాన శిబిరాలు, పేదవారికి భోజనాలు, వివిధ రకాలుగా ప్రజలకు సేవలను అందిస్తూ వారిపట్ల నిరంతరం అంకితభావంతో పనిచేస్తూ ప్రజల మన్నెలను పొందారు. వారి సేవలను గుర్తిస్తూ తమిళనాడు రాష్ట్రం లోఏసియా ఇంటర్నెట్ నేషనల్ కల్చర్ రీసెట్ యూనివర్సిటీ వారు ఆదివారం నాడు గౌరవ డాక్టరేట్ ను ప్రధానం చేశారు.ఈ సందర్భంగా యూనివర్సిటీ వారు మీరు గ్రామీణ వైద్యులు నాయకుడు ప్రాంతాల్లో రక్తం లేక గర్భిణీలు ఎన్నో అవస్థలు పడుతున్నారని వారికి రక్తం వల్ల ఉపయోగాలు రక్తం దానం చేస్తే మనకి వచ్చే ప్రయోజనాలు ఏమిటి అనే వాటిపై వారికి అవగాహన చేసి రక్తదాన శిబిరాలను నిర్వహిస్తూ గిరిజన ప్రాంత ప్రజలకు రక్తం అందించేవారు. ఉచిత వైద్య శిబిరాలు, ఆరోగ్యం మీదా అవగాహన, ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించడం, మిగిలిన ఆహారం వృధా కాకుండా పంపిణీ చేయడం, పేద విద్యార్థుల చదువులకు సహాయం చేయడం లాంటి అనేక సేవా కార్యక్రమాలు నిర్వహించారని కొనియాడారు. అలాగే నరేష్ కుమార్ మాట్లాడుతూ గిరిజన ప్రాంత ప్రజలకు నేను చేసిన సేవలను గుర్తిస్తూ నాకు ఎసియా ఇంటర్నేషనల్ కల్చర్ రీసెట్ యూనివర్సిటీ వారు గౌరవ డాక్టర్ట్ ప్రదానం చేయడం చాలా సంతోషకరంగా ఉంది అన్నారు.సేవాలకు ఇటువంటి గౌరవం దొరకడం అదృష్టంగా భావిస్తున్నాని గిరిజన ప్రాంతంలో మరింత విస్తృతంగా సేవలు చేయడానికి బలమైన వేదిక గా నిర్మించుకుంటానని తెలిపారు. నా మిత్రులకు, కుటుంబ సభ్యులుకు, ఋణపడి ఉంటానని గౌరవ డాక్టర్ట్ వచ్చిన తరువాత ఇంక సమాజానికి ఎక్కువ సేవా చేసే బాధ్యత మెలుగుతానని తెలియజేశారు.